సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



లోకాయత
# చార్వాక
సామాజిక చైతన్య త్రై మాసపత్రిక



సంపుటి : 1 | సంచిక : 1 | జూలై – సెప్టెంబర్ 2026

## ది.16.08.2026న వనపర్తిలో జరిగిన నాస్తిక అధ్యయన తరగతుల దృశ్యములు


గోపాలకృష్ణ


రమేష్


డా॥ కె.విజయకుమార్


మైత్రి యాదయ్య


ఎస్.ప్రభాకర్


ఎ.భాస్కర్


అంబటి నాగయ్య


ఎస్.భక్తరాజ్

**ప్రచురణ :**
**చార్వాకాశ్రమం**
స్థాపితం : 1973

**నిర్వహణ :**
**నాస్తిక సమాజం**
స్థాపితం : 1968

# లోకాయత - చార్వాక

జూలై -సెప్టెంబర్, 2026

గౌరవ సంపాదకులు : **డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
నాస్తిక్ శ్రీకాంత్



రచనలు, అభిప్రాయాలు
పంపవలసిన చిరునామా :

**బి. సుధాకర్**
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా – 522 240.
సెల్ : 9290619550, 9440101814
voiceofcharwaka@gmail.com


**ఈ సంచికలో...**


| | | |
|---|---|---|
| 1. | దైవ భావనల తిరస్కరణ : విశ్వవాప్త వైజ్ఞానిక చైతన్యం-వర్తమాన ధోరణులు | 3 |
| 2. | సరైన ప్రశ్నకు తప్పుడు సమాధానమే మతం! | 5 |
| 3. | భక్తుల్లో నైతికతను నిలదీస్తున్న | 7 |
| 4. | వైరస్‌లతో మన వైరం | 11 |
| 5. | మహాకవి జాషువా వర్గ దృష్టి | 13 |
| 6. | స్వర్గ దర్శనం | 19 |
| 7. | ముస్లిముల ఆచారాలు, దురాచారాలు | 22 |
| 8. | బైబిల్ బాగోతం | 25 |
| 9. | జీవుల పుట్టక - మానవ పరిణామం | 28 |
| 10. | వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియో | 31 |
| 11. | 'జెన్ ఆల్ఫా' ధిక్కార స్వరం | 34 |
| 12. | మతం పేరిట ఆర్థిక నేరాలకు పాల్పడితే | 36 |
| 13. | అసమానతకు శాశ్వత చిరునామా | 38 |
| 14. | చైతన్యాన్ని కలిగించిన నాస్తిక అధ్యయన | 40 |


శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IVA.

"నిర్లిప్తులంటే నాకు నిలువెల్లా అసహ్యం. బతికి ఉండడమంటే, అటోఇటో నిలబడడమే అన్నది నా నమ్మకం. నిజంగా సజీవులుగా ఉన్నవాళ్లు పౌరులుగా, పక్షపాతులుగా ఉండక తప్పదని నా విశ్వాసం. నిర్లిప్తత, నిరాసక్తతలు పరాన్న భుక్కులుగాను, పెడబుద్ధులుగాను మనుగడ సాగించడమే తప్ప అవి జీవ లక్షణాలు కాదు. నిర్లిప్తత నమ్మడానికి వీల్లేని దుర్విధి లాంటిది. అది మన కార్యక్రమ ప్రణాళికను నాశనం చేస్తుంది. లోతుగా ఆలోచించి రూపొందించిన ప్రణాళికను నిర్లిప్తత తలకిందులు చేస్తుంది. అది మనసును శిథిలం చేస్తుంది. జన సమూహాలు, పట్టుదలను వదిలిపెట్టి నిర్లిప్తులుగా వ్యవహరించడం వల్లే మనలో కీడు దాపురిస్తుంది"

– ఆంటోనియో గ్రాంసి
(ఇటలీ కమ్యునిస్టు నాయకుడు)


**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**

నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా – 522 240.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# దైవ భావనల తిరస్కరణ : విశ్వవ్యాప్త వైజ్ఞానిక చైతన్యం- వర్తమాన ధోరణులు

## 2025-2026 ప్యూ రీసెర్చ్ సెంటర్ (Pew Research Center) అంతర్జాతీయ నివేదిక

**- కోటేశ్వరరావు బి.వి.**

**మా**నవ వైజ్ఞానిక పరిణామ క్రమంలో శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ ఆలోచనలు పెరిగేకొద్దీ సాంప్రదాయ దైవ భావనలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. సహజంగా జరిగేదిదే. కొండ గుహలు, చెట్టుతొర్రల్లో వికృతంగా ఆదిమానవుడు ఏర్పాటు చేసుకున్న దేవుడు, ఈవేళ బంగారు నగలు, బంగారు జరీ అంచు పంచెతో వెంకటేశ్వరుడవలేదా...! అలాగే తరాలు మారుతున్నాయి. అవి జెన్ జెడ్లుగా, ఆల్ఫా తరాల ఆలోచనల సరళిని సంతరించుకుని తర్కంలో తర్కాన్ని అన్వేషిస్తున్నాయి. అందువలన సహజంగానే దైవభావమనే భ్రమలు బద్దలవుతాయి.

ఇంకాస్త సరళంగా విశ్లేషిస్తే దేవుడు, దైవభావం అనేది మానసిక భయాలు, అజ్ఞానం పునాదులుగా నిర్మించబడిన అదృశ్య శక్తుల నమ్మకాలు నేడు ఆధునిక విద్యా విధానం, సాంకేతిక ప్రగతి, సామాజిక చైతన్యం ముందు పటాపంచలు అవుతున్నాయి. ప్రకృతి నియమాలను, ఇహలోక వాస్తవాలను వైజ్ఞానికంగా అర్థం చేసుకుంటున్న ఆధునిక మానవుడు పరలోక భ్రమలను, మతపరమైన కట్టుబాట్లను పూర్తిగా వీడుతున్నాడు. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా దేవుడి ఉనికిని, మతాల ఆధిపత్యాన్ని సంపూర్ణంగా తిరస్కరిస్తూ భౌతికవాద దిశగా అడుగులు వేస్తున్న నాస్తిక జనాభా వేగంగా పెరుగుతోంది. ఈక్రమంలోనే ఇటీవలి 2025 - 2026 గ్లోబల్ సర్వేల, ప్యూ రీసెర్చ్ సెంటర్ (Pew Research Center) అంతర్జాతీయ నివేదికలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మతవాద దేశాలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా లౌకిక-ప్రజాస్వామ్యం ముసుగులో మత సైన్య విన్యాసాలు బహిరంగంగా చేస్తున్న భారతదేశంలోని బిజెపి వంటి పాలకులకు ఈ నివేదికలు మింగుడు పడడం లేదు. దీనికితోడు తెరపైకి వచ్చిన జెన్.జెడ్, ఆల్ఫా తరాలు మరింత తత్తరపాటుకు గురిచేస్తున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల నియంతృత్వ పోకడలు కళ్లముందే మట్టికరిచిన దృశ్యాలు భారత్ వంటి దేశాలకు మింగుడు పడడం లేదు. ఈ తరుణంలో 'పులి మీద పుట్రలా ప్యూ రీసెర్చ్ సెంటర్ (Pew Research Center) (2025-2026) విడుదలైన అంతర్జాతీయ నివేదిక బిజెపి వంటి మతతత్వ రాజ్యానికి మింగుడు పడడం లేదు. ప్యూ రీసెర్చ్ సెంటర్ (Pew Research Center) గురించి క్లుప్తంగా.... ఇది మతవాదానికి లేదా మతవ్యతిరేక వాదానికి గాని సంబంధించిన సంస్థ కాదు. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ కేంద్రంగా పనిచేస్తున్న ప్యూ రీసెర్చ్ సెంటర్ (Pew Research Center) అనేది ప్రపంచవ్యాప్తంగా సామాజికాంశాలు, ప్రజాభిప్రాయాలు, జనాభా మార్పులపై పరిశోధనలు చేసే ఒక అత్యంత ప్రతిష్టాత్మకమైన స్వతంత్ర అమెరికన్ థింక్ ట్యాంక్. దీని మూలాలు 1990లో ఒక చిన్న పరిశోధన ప్రాజెక్ట్‌గా ప్రారంభమైనప్పటికీ, జూలై 1, 2004న ఒక లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ కింద అధికారికంగా పూర్తి స్థాయి స్వతంత్ర విభాగంగా రూపాంతరం చెందింది. ఈ సంస్థ యొక్క ప్రాథమిక విధి సమాజానికి ఎటువంటి పక్షపాతం లేని పక్కా సాక్ష్యాధారాలతో కూడిన నిజాలను, గణాంకాలను అందించడం. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని ప్రజల సామాజిక ఆలోచనలు, రాజకీయ వైఖరులు, మారుతున్న మతపరమైన నమ్మకాలు, సైన్స్ మరియు సాంకేతికత వంటి విభిన్న రంగాలపై నిరంతరం ప్రజాభిప్రాయ సేకరణ, సర్వేలు

నిర్వహించడం దీని ముఖ్య విధి. అదేవిధంగా, ప్రపంచవ్యాప్తంగా మారుతున్న జనాభా తీరుతెన్నులు, వలసలు, వివిధ జాతులు, మతాల జనాభా వృద్ధి లేదా క్షీణతను వైజ్ఞానికంగా గమనిస్తూ నివేదికలను విడుదల చేస్తుంది. ఈ సంస్థ ఏ రాజకీయ పార్టీకి లేదా మతానికి మద్దతు ఇవ్వని నిష్పక్షపాత వైఖరిని కలిగి ఉంటుంది. అలాగే ప్రభుత్వాలకు ఎటువంటి విధానపరమైన సిఫార్సులు చేయకుండా, కేవలం సమాజంలో ఉన్న వాస్తవ సమాచారాన్ని మాత్రమే సేకరించి ప్రపంచం ముందు ఉంచుతుంది.

ఈ నిష్పాక్షిక నివేదిక ఆధారంగా విశ్వవ్యాప్తంగా దైవ భావనలను తిరస్కరిస్తూ హేతుబద్ధంగా జీవిస్తున్న సమాజాల వర్తమాన ధోరణుల విశ్లేషణలను బట్టి తూర్పు ఆసియా ప్రాంతంలో అధికారికంగా కమ్యూనిస్ట్ దేశాలు కాకపోయినప్పటికీ, అత్యంత వేగంగా దైవ భావనలను వీడుతున్న దేశాలలో దక్షిణ కొరియా అగ్రస్థానంలో నిలుస్తోంది. ఇక్కడి అధునాతన జీవనశైలి, శాస్త్రీయ విద్యా విధానం కారణంగా దాదాపు యాభై ఐదు శాతానికి పైగా జనాభా తాము ఏ దేవుడిని లేదా మతపరమైన మూఢనమ్మకాలను నమ్మడం లేదని స్పష్టం చేశారు. అలాగే చైనా ప్రాంతీయ పరిధిలోకి వచ్చే మకావు, హాంకాంగ్ వంటి అత్యంత సంపన్న, పారిశ్రామిక నగరాలలో కూడా మెజారిటీ ప్రజలు దైవ ప్రార్థనలను పక్కనబెట్టి భౌతికవాద జీవనానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మకావులో అరవై శాతానికి దగ్గరగా, హాంకాంగ్‌లో యాభై రెండు శాతానికి పైగా పౌరులు దైవ ఉనికిని తిరస్కరిస్తూ వైజ్ఞానిక చైతన్యంతో జీవిస్తున్నారు. యూరప్ ఖండంలోని అత్యున్నత జీవన ప్రమాణాలు కలిగిన దేశాలలో సాంప్రదాయ చర్చిలు పూర్తిగా ఖాళీ అవుతూ, దైవ భావనలు కేవలం పురాతన సంస్కృతిగా మాత్రమే మిగిలిపోతున్నాయి. స్వీడన్, డెన్మార్క్ వంటి స్కాండినేవియన్ దేశాలలో దాదాపు డెబ్బై శాతానికి పైగా జనాభా తమ దైనందిన జీవితంలో దేవుడికి గానీ, పూజలు మరియు ప్రార్థనలకు గానీ ఎలాంటి స్థానం లేదని తేల్చిచెప్పారు. ఇక్కడి పౌరులు మానవ హక్కులు, సామాజిక సంక్షేమమే పరమావధిగా బతుకుతున్నారు తప్ప కంటికి కనిపించని శక్తులపై ఆధారపడటం లేదు. మరోవైపు చెక్ రిపబ్లిక్, ఎస్టోనియా దేశాలు యూరప్ ఖండంలోనే అత్యధిక నాస్తిక జనాభా కలిగిన శక్తులుగా అవతరించాయి. ఇక్కడ డెబ్బై ఐదు శాతానికి పైగా ప్రజలు దేవుడు అనే భావనను పూర్తిగా తిరస్కరిస్తూ, ప్రకృతిని, మానవ శ్రమను మాత్రమే నమ్ముతున్నారు. ఇక అధికారికంగానే దేవుడి ఉనికిని, మతాల జోక్యాన్ని చట్టబద్ధంగా నిరోధించిన చైనా, ఉత్తర కొరియా, వియత్నాం వంటి దేశాలలో రాజ్య నాస్తికత్వం సుదీర్ఘకాలంగా కొనసాగుతోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన చైనాలో దాదాపు వంద కోట్లకు పైగా ప్రజలు ఏ మతంతోనూ సంబంధం లేకుండా కేవలం వైజ్ఞానిక మరియు భౌతిక నియమాలకు లోబడి జీవనం సాగిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఈ పరిణామాలు మానవుడు తన దైవ భీతిని, అజ్ఞానాన్ని వీడి హేతుబద్ధమైన ఆలోచనా విధానం వైపు ఎంత వేగంగా అడుగులు వేస్తున్నాడో స్పష్టంగా నిరూపిస్తున్నాయి.

**భవిష్యత్ భౌతికవాదులదే.....** మతం రొచ్చులో రాజకీయాలు చొరబడకూడదనే బలీయమైన లక్ష్యాలను అమలు చేస్తున్న దేశాలు భవిష్యత్తులో అటు యూరప్ ఇటు ఆసియా దేశాల్లో మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నట్టు సర్వేలు వెల్లడించాయి. ఈ ప్రభావం రేపు జెన్.జెడ్, ఆల్ఫా తరాల క్రియాశీల పాత్రపైనే ఆధారపడి ఉంటుందని చెప్పాలి. అందువలన నాస్తిక, హేతువాద, సాంస్కృతిక, మానవవాద, శ్రామిక, కార్మిక, కర్షకలోకాన్ని కాంక్షించిన వైతాళికులు గ్రీకు తత్వవేత్త ఎపిక్యురస్, మావో జెడాంగ్, మార్క్స్, లెనిన్, బారన్ డి హెల్బాక్, అజితకేశ్ కంబల్, పెరియార్ ఇ.వి.ఆర్, అంబేద్కర్, మానవవాద పితామహుడు, ఇటాలియన్ పండితుడు ఫ్రాన్సిస్కో పెట్రార్ట్, ఎం.ఎన్.రాయ్ వంటివారి ఆశయాల సౌధాలే రేపటి తరాలకు ఆవాసాలు.

# సరైన ప్రశ్నకు తప్పుడు సమాధానమే మతం!

– డా॥ దేవరాజు మహారాజు

**ఈ** దేశంలో ఇప్పుడు అధికారంలో ఉండి, ప్రజలకు తప్పుడు సమాధానాలు ఇస్తున్న వారెవరూ? ప్రస్తుత పాలకులే! మతాన్ని ఒక తప్పుడు సమాధానంగా ప్రజల ముందుకు తేవడం... పైగా, ప్రశ్నించిన వారిని జైలుకి పంపడం, లేదా చంపేయడం చేస్తున్నారు. అంతకన్నా ఈ పదేళ్ళ కాలంలో వీరు సాధించింది ఏముందీ? కారల్‌మార్క్స్ ఏమన్నాడు? "ప్రజలకు నిజమైన ఆనందాన్ని అందివ్వాలంటే భ్రమలు కల్పించే మతాన్ని రద్దు చేయాలి. భ్రమలు పోవాలని అనుకోవడమంటే, ఆ భ్రమలు కలిగించే పరిస్థితుల్ని మనం మార్చుకోవాలి!" అని! అబ్బే...! మన దేశ నాయకులకు ఇలాంటి మాటలు చెవికెక్కవు. ఎక్కినా, అస్సలు అర్థంకావు. "భారతదేశానికి దేవుడిచ్చిన బహుమానం-మోడీ" అన్నారు వెంకయ్య నాయుడు. ఆయన దేశానికి ఉపాధ్యక్షుడయ్యారు. మధ్యప్రదేశ్ వ్యవసాయ మంత్రి మరింత రెచ్చిపోయి "రాముడు, కృష్ణుడు లాగా మోడీ దేవుడి అవతార"మని పొగిడారు. "దేవతల రాజు మోడీ" అన్నది ఎవరో కాదు, బిజెపి జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా. ఇవన్నీ పిచ్చి ప్రేలాపనలని ఈ దేశ ప్రజలనుకుంటే-దానికి బిజెపి వారి ప్రమేయం లేదు. వీరికి కనీస ఇంగిత జ్ఞానం ఉందా? అని దేశ ప్రజలు అనుమానపడుతున్నారు. పోనీ ఒక దార్శనికుడి గురించి కొంచెం ఎక్కువగా చెప్తున్నారులే అని సర్ది చెప్పుకుందామంటే అది కూడా కాదాయె. ఎవరి గురించి చెప్తున్నారో ఆయన కార్పోరేట్లకు పాలేరాయె!

సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ఇలా అన్నారు! "మోడీ కాకపోతే ఇంకెవరూ? అని అడుగుతారు. గత ఐదేళ్ళలో ఆయనేం చేశారో చూపండి. ఐదు కోట్ల ఉద్యోగాలు పోయాయి. రైతులు సంక్షోభంలో కూరుకుపోయారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, కాగ్, లోక్‌పాల్, సిబిఐ, ఎన్.ఐ.ఏ, మీడియా-అన్నింటినీ వశపరచుకున్నారు. మూక దాడులు, ద్వేషపూరితమైన అసత్య వార్తా ప్రసారాలు, కలుషితమైన సామాజిక మాధ్యమాలు ఎన్నని చెప్పుకోవడం? ఇంకా మరో ఐదేళ్ళు గనక పొరపాటున వారికి అవకాశం ఇస్తే-వేల వేల ఏళ్ళుగా సాధించుకున్న నాగరికతను వదిలేసుకోవడం జరుగుతుంది. మళ్ళీ మూడు వేల ఏళ్ళ నాటి జీవ పరిణామ దశలకు వెళ్ళిపోవాల్సిందే!". మతాన్ని బూచిగా చూపుతూ పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వ పథకాలు ఎలా ఉన్నాయో చూడండి. ఎవరి పైసలతో వారే బ్యాంక్ ఎకౌంట్ తెరిస్తే దాని పేరు 'జన్‌ధన్'. ఎవరి ఇల్లు వారే ఊడ్చుకుంటే దానికి 'స్వచ్ఛ భారత్'. ఎవరి పిల్లని వారే పెంచుకుంటే దానికి 'బేటీ బచావో బేటీ పఢావో' అని పేరు. ఆ పిల్ల కోసం ఎకౌంట్లో పైసలు దాస్తే దానికే 'సుకన్య సమృద్ధి యోజన' అని పేరు. ఇందులో కేంద్ర ప్రభుత్వం ప్రజలకేం చేసినట్టో? ఈ మాత్రం దానికి పిచ్చి వాళ్ళంతా గంతులేస్తూ తప్పెట్లూ తాళాలతో ప్రచారాలు చేస్తున్నారయ్యే. ఈ దేశ ప్రజల ప్రాణాలకు భలే మోపయ్యారు. వీరంతా! హిందూ మతోద్ధారకులు!!

భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుండి మన్‌మోహన్ సింగ్ దాకా 14 మంది భారత ప్రధానుల కాలంలో దేశానికి రూ.యాభై ఆరులక్షల కోట్ల అప్పు తెచ్చారు. మోడీ వచ్చాక ఆయనొక్కడే చేసిన అప్పు ఎనభై లక్షల కోట్లు. పోనీ ప్రాజెక్టులు కట్టారా? లేదు. ఉపాధి పెరిగిందా? లేదు. నిరుద్యోగం పెరిగిందా? అవును. రూపాయి విలువ పడిపోయిందా? అవును. హంగర్ ఇండెక్స్‌లో భారత దేశం చివరికి చేరిందా? అవును. ఇంత సిగ్గు చేటుగా ఉంటే మోడీ ప్రభుత్వం హిందుత్వ పేరుతో కాలయాపన చేస్తూ ఉంది కదా? బంగ్లాదేశ్, నేపాల్ లాంటి చిన్న

దేశాలు కూడా హంగర్ ఇండెక్స్‌లో భారతదేశం కన్నా మెరుగైన స్థానంలో ఉన్నాయి. గుడ్డిగా మోడీ భజన చేసేవారు, అభివృద్ధిని పక్కకు తోసి మతాన్ని పట్టుకుని వేలాడేవారు ఈ విషయాలు వివరంగా తెలుసుకోవడం అవసరం.

ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆర్.ఎస్.ఎస్–బిజెపి పాలకులు–ఈ దేశం సెక్యులర్ దేశం అన్నది గుర్తించరు. అసలు ప్రకృతిలోనే సెక్యులర్ లక్షణాలు ఉన్నాయన్న విషయం అర్థం చేసుకోగల స్థాయి వారికి లేదు. ఉదాహరణకు చూడండి : నేల మీద పాకే చీమ నుండి నింగి వైపు ఎదిగిన మహావృక్షం దాకా; నింగిలో విహరించే పక్షి నుండి నీటిలో ఈదే చేప దాకా అన్నీ ఒక దానితో ఒకటి అనుసంధానం చేయబడ్డవే. జీవుల్ని, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం లోనే మనిషి వివేకం ఉంది. ఒక్క మనిషే బతకాలి. మిగతా జీవులన్నిటినీ నాశనం చేయాలి అనుకోవడం మూర్ఖ లక్షణం. బతకడమూ బతకనివ్వడమూ అవసరం. సామాజిక, రాజకీయ పరిపాలనా రంగాలకైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. 'ఒక దేశంలో అందరూ ఒక్క భాషే మాట్లాడాలి. ఒక్క తిండే తినాలి. ఒక్క ఆలోచనే చేయాలి. ఒక్క జై శ్రీరామనే అనాలి' అన్నది మూర్ఖుల సిద్ధాంతం. ఏ ఒక్కటీ ఒకటిగా మనలేదు. అది ప్రకృతి ధర్మం! ఏ ఒక్క దేశమూ ఇతర దేశాల సహాయ సహకారాలు లేకుండా అభివృద్ధి సాధించలేదు. ఇతర భాషా పదాలు కలుపుకోని భాష ఏదీ లేదు. ప్రతి జీవికీ సమయానికి ఆహారం కావాలి. నిజమే! కానీ ఒక్కో జీవికి ఒక్కో ఆహారం అవసర మౌతుంది. అందరూ ఒకలాంటి తిండే తినాలంటే కుదరదు. తినాలని శాసిస్తే అసలే కుదరదు.

ఈ దేశానికి నెహ్రూ చూపించిన వైజ్ఞానిక స్పృహ–మార్గాన్ని వదిలేసిన ప్రస్తుత ప్రధాని నేతృత్వంలో ఏం జరుగుతున్నదో చూడండి. చరిత్ర పాఠ్యపుస్తకాల్లో రామాయణం, భారతం, వేదాలు, ఆయుర్వేదం వంటి వాటికి చోటు కల్పించినట్లు ఎన్.సి.ఇ.ఆర్.టి చైర్మన్ సి.ఐ.ఐజాక్ ప్రకటించారు. 7 నుండి 12 తరగతుల విద్యార్థులకు ఇవి నేర్పిస్తూ, వారిలో దేశభక్తిని పెంపొందిస్తామని అన్నారు. దేశభక్తి లేకపోవడం వల్ల వేలాది మంది విద్యార్థులు విదేశాలకు వెళ్ళిపోతున్నారని వాపోయారు. ఉద్యోగావకాశాలు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టలేక పోయిన ఛైర్మన్ నుండి అంతకన్నా ఏమాశించగలం? కేంద్రానికి వత్తాసు పలికారని అర్థం చేసుకోవాలి! అసలు రామాయణ, మహాభారతాలు భారతీయ సంస్కృతి ఎలా అయ్యాయి? వాటికి దొరికిన ఆధారాలేమిటో చెప్పాలికదా? అది చేతకాదేం?

తమిళనాడులోని అన్ని థియేటర్లలో సినిమా ప్రారంభంలో–భారత రాజ్యాంగం ద్వారా సుమారు వంద కోట్ల మంది ఈ దేశ ప్రజల బానిస సంకెళ్ళను తెంచిన మహావ్యక్తి డా॥ బి.ఆర్. అంబేద్కర్ జీవిత పోరాటం గురించి 5 నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీ ప్రదర్శించాలని అక్కడి గత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఆదేశించారు. ఆ రాజ్యాంగం ద్వారానే బిసిలు, ఎస్సీలు, ఎస్టీలు ముఖ్యమంత్రులు, ప్రధానులు, రాష్ట్రపతులూ అవుతున్నారన్నది గ్రహించాలి. అణగారిన వర్గాలకు అధికారం వస్తే ఇలా సమాజాన్ని జాగృతం చేసే నిర్ణయాలు తీసుకుంటారు. మరికొందరు ప్రభుత్వ ఆస్తులు అమ్ముతూ కార్పోరేట్లకు ఊడిగం చేస్తుంటారు. ఈ దేశంలోని సామాన్య ప్రజలు విజ్ఞతతో ఆలోచించి, ఇక నాయకులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

"రాహకె సత్తర్ సె బడ్ కె / కుచ్ పహీ హై మంజిలే / రాస్తే ఆవాజ్ దేతీహై / సఫర్ జారీ రఖ్నే" అంటే–దీని అర్థం–దారిలో ఉన్న రాళ్ళ కంటే/ ఎక్కువేంకాదు–గమ్యాలు/ ప్రయాణం కొనసాగిస్తుండమని/ రహదారులు పిలుస్తున్నాయి!". ఏమీ అయిపోలేదన్న ఆశాభావం పై కవితా పంక్తుల్లో కనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు తమ ప్రయత్నం, తమ ప్రయాణం కొనసాగిస్తూనే ఉండాలి. దారిలో మైలు రాళ్ళలాగా పాలకులు వచ్చి పోతుంటారు. మతాన్ని పక్కన పెట్టి, అభివృద్ధిపై దృష్టి పెట్టే నాయకుల్ని ఎన్నుకోవాలి! •

# భక్తుల్లో నైతికతను నిలదీస్తున్న ఆలయ దొంగతనాలు

**- కోటేశ్వరరావు బి.వి.**

**మా**నవ పరిణామ క్రమంలో దైవభావన అనేది అంతర్గత భయాందోళనల నుండి, ప్రకృతి పరిణామం నుంచి పుట్టిన ఒక ఊహాజనిత భావం. పరాధీన భావవాదానికి తరతరాలుగా ఇదే భుక్తిమార్గం... రక్షణ కవచం. శతాబ్దాలుగా మనుషులు సృష్టించుకున్న పలు రూపాలను, వాటి చుట్టూ నమ్మకాల సామ్రాజ్యాలను, ఆడంబరాల ఆలయాలను నిర్మించుకున్నారు. నేటి ఆధునిక సమాజంలో ఒకవైపు ఆధ్యాత్మిక ప్రదర్శనలు, అంధవిశ్వాసాలు, భారీ ఉత్సవాలు నానాటికీ పెరుగుతుంటే, దానికి సమాంతరంగా అదే దేవుళ్ల నిలయాలలో దొంగతనాలు, నిధుల దోపిడీలు అదే స్థాయిలో విస్తరించడం తీవ్రమైన సామాజిక విస్మయాన్ని కలిగిస్తోంది. అంతేకాదు భక్తుల నైతికతను నిలదీస్తుంది. ఈ విరుద్ధమైన గమనాన్ని హేతుబద్ధంగా పరిశీలిస్తే, భక్తులు నమ్ముతున్న దైవత్వపు అస్తిత్వంలోనే మూల లోపం ఉందనే నగ్న సత్యం బోధపడుతుంది. సర్వశక్తిమంతుడు, సృష్టికర్త, విశ్వాన్ని శాసించేవాడు అని భక్తులు నమ్మే ఆ దేవుడు, కనీసం తనను తాను రక్షించుకోలేకపోవడం, తన ఆస్తులను కాపాడుకోలేకపోవడం మానవ నమ్మకాలలోని డొల్లతనాన్ని నవ్వులపాలు చేస్తోంది. భక్తి అనేది కేవలం స్వార్థ ప్రయోజనాల కోసం, లౌకిక కోరికల నెరవేర్పు కోసం చేసే ఒక వ్యాపారాత్మక ప్రదర్శనగా మారడం వల్లే, ఆలయాల పవిత్రత అనేది కేవలం ఒక భ్రమగా మిగిలిపోతోంది. విగ్రహాలకు స్వయంశక్తి లేదనే చేదు నిజాన్ని గ్రహించలేక, దేవుడిపై లేని భయాన్ని నటిస్తూ సమాజం తన నైతిక బాధ్యతలను విస్మరిస్తోంది. ఈ అస్తిత్వ సంక్షోభం కేవలం బాహ్య శక్తుల దొంగతనాలకే పరిమితం కావడం లేదు; దైవశక్తికి నిలయాలుగా భక్తులు భ్రమపడే అత్యంత ప్రతిష్టాత్మక ఆలయాలలోనే పెద్ద ఎత్తున అంతర్గత దోపిడీలు వెలుగుచూస్తున్నాయి. కోట్లాది రూపాయల ఆదాయం, అపారమైన భక్తుల అంధనమ్మకం ఉన్న క్షేత్రాలను నడిపించే పెద్దలే, అక్కడి భక్తుల సొమ్మును మరియు దేవుడి ఆస్తులను కొల్లగొట్టడం వ్యవస్థల వైఫల్యాన్ని, దైవభావనలోని నిస్సహాయతను బహిర్గతం చేస్తోంది. ఆలయాల నిర్వహణ బాధ్యతల్లో ఉండే కొందరు అధికారులు, ట్రస్టు సభ్యులు మరియు రాజకీయ ప్రభావం ఉన్న వ్యక్తులు భక్తులు సమర్పించే కానుకలను, హుండీ ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్న వైనం దైవత్వం అనేది కేవలం దోపిడీకి ఒక సాధనంగా మారిందని నిరూపిస్తోంది. సామాన్య భక్తుడు తన కష్టార్జితాన్ని దైవసన్నిధిలో అర్పించుకుంటుంటే, ఆ శక్తుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని పెద్దలే ఆ సొమ్మును స్వార్థానికి వాడుకోవడం భక్తుల మూల నమ్మకాలపై గొడ్డలిపెట్టుగా మారుతోంది. దేవుడు సర్వవ్యాపి, అంతా చూస్తూ ఉంటాడు అని ప్రచారం చేసేవారే ఈ దోపిడీలకు సూత్రధారులు కావడం, దేవుడనే వాడు ఒక మూగ సాక్షి మాత్రమేనని తేల్చిచెబుతోంది. గత యాభై ఏళ్ల కాలంలో భారతదేశంలో జరిగిన కొన్ని అతి పెద్ద వ్యవస్థీకృత ఆలయ దొంగతనాలు, వాటి వెనుక ఉన్న నేరగాళ్ల వివరాలు పరిశీలిస్తే, రాయి రప్పల వెనుక ఎలాంటి దైవశక్తి లేదనే హేతువాద దృక్పథం మరింత బలపడుతుంది.

చారిత్రక రికార్డుల ప్రకారం 1974లో తమిళనాడులోని శివపురం ఆలయానికి చెందిన 10వ శతాబ్దపు సుప్రసిద్ధ కాంస్య నటరాజ విగ్రహం స్మగ్లింగ్‌కు గురైంది. అప్పట్లో అంతర్జాతీయ ఆర్ట్ డీలర్ అయిన బెన్ హెల్లర్ సహాయంతో ఈ విగ్రహాన్ని అమెరికాకు తరలించగా, సుదీర్ఘ చట్టపరమైన పోరాటం తర్వాత 1986లో దీనిని భారత్‌కు తిరిగి తీసుకువచ్చారు. ఆ తర్వాత 1978 నవంబర్ 10న ఆంధ్రప్రదేశ్‌లోని వెయ్యేళ్ల నాటి చారిత్రక సింహాచలం ఆలయంలో దొంగలు శతాబ్దాల నాటి 8.60 కిలోల బంగారు ఆభరణాలు, 11.14 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లారు. ఈ కేసులో సుప్రసిద్ధ స్టూవర్టుపురం దొంగల ముఠా నాయకులు చోటా ప్రసాద్, గజ్జెల మల్లేష్‌లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం ఇటీవలి కాలంలో కూడా భక్తులు సమర్పించిన బంగారం మాయమవ్వడం మరియు హుండీ లెక్కింపులో వాలంటీర్ బి. రాంబాబు వంటి సిబ్బంది నగదు చోరీ చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం వంటి అంతర్గత దోపిడీలు జరిగాయి. తాను అలంకరించుకున్న బంగారాన్ని దొంగలు దోచుకుపోతుంటే సదరు దేవుడు కేవలం ఒక జడపదార్థంలా చూస్తూ ఉండిపోవడం భక్తులను ఆలోచనలో పడేయాలి. ఈ అంతర్జాతీయ స్మగ్లింగ్ మూలాలు 2005-2008 కాలంలో మరింత తీవ్రరూపం దాల్చాయి. తమిళనాడులోని సుత్తమల్లి మరియు శ్రీపురందన్ ఆలయాల నుండి 11వ శతాబ్దానికి చెందిన చోళుల కాలం నాటి కోట్లాది రూపాయల విలువైన కాంస్య నటరాజ, ఉమా పరమేశ్వరి విగ్రహాలను అంతర్జాతీయ స్మగ్లర్ సుభాష్ చంద్ర కపూర్ నేతృత్వంలోని ముఠా దొంగిలించింది. ఈ ముఠాకు స్థానిక ఆలయ సిబ్బంది సహకరించారు. 2011లో జర్మనీలో సుభాష్ కపూర్‌ను అరెస్టు చేసి భారత్‌కు అప్పగించగా, 2022 నవంబర్లో తమిళనాడులోని కుంభకోణం కోర్టు అతనికి, అతని అనుచరుడు సంజీవి అశోకన్‌కు 10 ఏళ్ల కఠిన జైలు శిక్ష విధించింది. అలాగే 2014 డిసెంబర్లో హిమాచల్ ప్రదేశ్ కులూలోని చారిత్రక రఘునాథ్ ఆలయం నుండి శతాబ్దాల నాటి అరుదైన అష్టధాతువులతో చేసిన రఘునాథ్ (రాముడు) విగ్రహం, హనుమంతుడి విగ్రహం మరియు వెండి వస్తువులను దొంగిలించారు. ఈ కేసులో నేపాల్‌కు చెందిన ప్రధాన స్మగ్లర్ నారాయణ్ గోపాల్ మరియు అతని ముఠాను పోలీసులు 2015 జనవరిలో అరెస్టు చేసి, విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ శృంఖలాలు ఇక్కడితో ఆగకుండా 2026 జూన్లో దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన అయోధ్య రామ్ మందిర్లో కోట్ల రూపాయల విరాళాలు పక్కదారి పట్టేలా చేశాయి. హుండీ కానుకలు మరియు నగదు లెక్కింపు పర్యవేక్షణలో ఉన్న సిబ్బంది సిసిటివి కెమెరాల కన్నుగప్పి నోట్ల కట్టలను తమ దుస్తుల్లో దాచి తరలిస్తూ పట్టుబడటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ భారీ స్కామ్‌లో అనుకల్ప్ మిశ్రా, లవకుష్ మిశ్రా, అవినాష్ శుక్లాతో సహా ఎనిమిది మంది నిందితులను స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ అరెస్టు చేసింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ కూడా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విశ్వాన్ని ఏలే దైవం కొలువై ఉన్నాడని నమ్మే చోటే మనుషులు ఇంత నిర్భయంగా దోపిడీకి పాల్పడుతున్నారంటే, అక్కడ ఉన్నది దైవశక్తి కాదు, కేవలం మనుషుల స్వార్థం మాత్రమేనని స్పష్టమవుతోంది. ఇలా కొన్ని కేసులు పోలీసులు ఛేదించినప్పటికీ, మరికొన్ని దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ ఎలాంటి ఆచూకీ దొరకని దొంగతనాలు

చట్టాన్ని, భక్తుల గుడ్డి నమ్మకాలను వెక్కిరిస్తూనే ఉన్నాయి. 1970ల కాలంలో తంజావూరు బృహదీశ్వరాలయం అనే ప్రపంచ వారసత్వ కట్టడం నుండి చోళుల కాలం నాటి అత్యంత విలువైన మరకత (పచ్చ) లింగం దొంగిలించబడింది. అంతర్జాతీయ మార్కెట్లో వందల కోట్ల విలువైన ఈ పవిత్ర లింగం జాడను కనుగొనడంలో దర్యాప్తు సంస్థలు నేటికీ విఫలమయ్యాయి. అలాగే 1985 తర్వాత పూరీ జగన్నాథ ఆలయ అంతర్గత రత్నభండార్ తాళాలు మాయమవ్వడం, లోపల ఉన్న శతాబ్దాల నాటి రాజవంశాల బంగారు ఆభరణాల లెక్కింపులో దశాబ్దాలుగా జరుగుతున్న ఆలస్యం వెనుక పెద్దల హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ఖచ్చితమైన చట్టపరమైన ముగింపు రాలేదు. 1990ల కాలంలో రాజస్థాన్ సరిహద్దుల్లోని పురాతన జైన దేవాలయాల నుండి పద్మప్రభు మరియు రిషభనాథ తీర్థంకరుల విగ్రహాలను దొంగిలించారు. స్థానిక పోలీసుల రికార్డులలో ఈ కేసులు 'అపరిష్కృతం'గా మిగిలిపోగా, ఆ విగ్రహాలు విదేశాల్లోని ప్రైవేట్ కలెక్టర్ల గదుల్లో చేరిపోయాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ చారిత్రక, ఆధునిక దోపిడీల పరంపర కేవలం ఆర్థిక దొంగతనాలు మాత్రమే కాదు; అవి మానవ కల్పిత దైవత్వపు నిస్సహాయతకు నిదర్శనాలు. దేవుడు మనుషులను రక్షిస్తాడనే భ్రమల కంటే, మానవ నిర్మిత చట్టాలు, పోలీసు వ్యవస్థలు మాత్రమే ఆ విగ్రహాలను రక్షించగలవనే లౌకిక సత్యాన్ని భక్తులు ఇప్పటికైనా గుర్తించి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ప్రభు నివాసాల్లో...... నైచ్యం:** భక్తి ముసుగులో సాగిన దొంగతనాల కాలక్రమం 1979లో యూరప్‌లోని సైప్రస్‌లోని ప్రసిద్ధ పనగియా కనకారియా చర్చిలోకి భక్తుల వలె ప్రవేశించిన కొందరు వ్యక్తులు ప్రార్థనలు చేసుకుంటూ శతాబ్దాల నాటి అమూల్యమైన జీసస్, మేరీ మాతల మొజాయిక్ చిత్రాలను గోడల నుండి జాగ్రత్తగా తొలగించి దొంగిలించారు. ఆ తర్వాత 1990లో కువైట్ ఆర్ట్ మ్యూజియం మరియు మసీదు సేకరణలశాలలో సాధారణ సందర్శకుల్లా తిరిగిన కొందరు దొంగలు భద్రతా కళ్ళు గప్పి మొఘల్ కాలం నాటి రత్నాలు పొదిగిన ఇస్లామిక్ పాత్రలను, బంగారు ఆభరణాలను తమ బ్యాగులలో దాచుకుని పారిపోయారు. 2002లో స్వీడన్‌లోని చారిత్రక స్ట్రాంగ్నస్ కాథెడ్రల్ చర్చికి సాధారణ భక్తుల వేషంలో వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రార్థన ముగిసిన తర్వాత అందరూ చూస్తుండగానే గాజు పెట్టెలను పగలగొట్టి రాచరిక బంగారు కిరీటాలను, రాజదండాలను ఎత్తుకెళ్లారు. కొన్ని ఏళ్ల తర్వాత 2013లో పెరూ దేశంలోని చర్చ్ ఆఫ్ ది వర్జిన్ ఆఫ్ కోపాకబానాకు దైవదర్శనం కోసం వచ్చిన భక్తుల గుంపులో కలిసిపోయిన దొంగలు గర్భాలయంలోని వర్జిన్ మేరీ విగ్రహానికి అలంకరించిన 12 బంగారు కిరీటాలను, వెండి చెప్పులను దొంగిలించారు. అలాగే 2016లో ఈజిప్ట్ రాజధాని కైరోలోని ప్రసిద్ధ అల్-రిఫాయ్ మసీదుకు ప్రార్థనలు చేసుకోవడానికి వచ్చినట్లు నటించిన కొందరు భక్తులు గోడలకు అలంకరించి ఉన్న ఆరు అరుదైన చారిత్రక ఇస్లామిక్ లాంతర్లను ఎవరికీ అనుమానం రాకుండా విరగ్గొట్టి దొంగిలించారు. 2018లో లండన్‌లోని ఒక ప్రముఖ చర్చిలో ఆదివారం ప్రార్థనలు జరుగుతున్న సమయంలో భక్తుడిగా కూర్చున్న ఒక దొంగ, పూజారి ప్రసంగంపై అందరూ శ్రద్ధ పెట్టిన వేళలో పక్కనే ఉన్న వెండి పవిత్ర పాత్రను, విరాళాల పెట్టెను దొంగిలించి పారిపోయాడు. ఇటీవలి కాలంలో 2021లో సౌదీ అరేబియాలోని రియాద్ నగరంలో ఐదు పూటలా నమాజ్ చదవడానికి వచ్చే పక్కా భక్తుడిలా నటిస్తూ ఒక వ్యక్తి వరుసగా ఆరు మసీదులలో

ప్రార్థనల అనంతరం అందరూ వెళ్ళిపోయాక హుండీలను పగలగొట్టి విరాళాల సొమ్మును దొంగిలించాడు. 2022లో న్యూయార్క్ నగరంలోని సెయింట్ అగస్టిన్ రోమన్ కాథలిక్ చర్చిలోకి పగటిపూట భక్తుల వలె వచ్చిన దొంగలు అక్కడ ప్రార్థనలు జరుగుతున్న సమయంలోనే ఎవరికీ అనుమానం రాకుండా 16 కోట్ల విలువైన బంగారు పూత పూసిన చారిత్రక పవిత్ర పాత్రను దొంగిలించారు. చివరగా 2024లో ఇటలీలోని చర్చ్ ఆఫ్ శాన్ డొమెనికోకు రోజూ ప్రార్థనలకు వచ్చే భక్తుడిగా నమ్మకం కుదిరించుకున్న ఒక వ్యక్తి, చర్చి మూసివేసే సమయంలో లోపలే దాక్కుని అర్ధరాత్రి వేళ శతాబ్దాల నాటి బంగారు సిలువను మరియు వెండి పాత్రలను దొంగిలించాడు.

**మక్కా మషీద్‌లో......** 1979 నవంబర్ 20న సౌదీ అరేబియాలోని ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన, అతిపెద్ద మసీదు అయిన మక్కాలోని 'మస్జిదుల్ హరామ్' (గ్రాండ్ మసీదు) లోకి వందలాది మంది సాయుధ ఉగ్రవాదులు సాధారణ భక్తుల వలె ప్రవేశించారు. తెల్లవారుజామున ప్రార్థనలు జరుగుతున్న సమయంలో వారు మసీదును తమ ఆధీనంలోకి తీసుకుని, వేలాది మంది భక్తులను బందీలుగా చేసుకున్నారు. రెండు వారాల పాటు సాగిన ఈ ఘోర లూటీ మరియు ముట్టడిలో మసీదులోని అనేక చారిత్రక వస్తువులు ధ్వంసమవడమే కాకుండా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత 1990 గల్ఫ్ యుద్ధ సమయంలో ఇరాక్ సైన్యం కువైట్‌పై దాడి చేసినప్పుడు, అక్కడి రాయల్ ప్యాలెస్ మరియు మసీదుల అనుబంధ కలెక్షన్ అయిన 'దార్ అల్-అథర్ అల్-ఇస్లామియ్యా నుండి దాదాపు 20,000 అరుదైన ఇస్లామిక్ చారిత్రక కళాఖండాలను లూటీ చేసి దొంగిలించారు. ఇందులో శతాబ్దాల నాటి మసీదు దీపాలు, ఖురాన్ ప్రతులు, ఇస్లామిక్ పాత్రలు ఉన్నాయి. కొన్ని ఏళ్ల తర్వాత 2003లో ఇరాక్ యుద్ధం జరిగిన సమయంలో బగ్దాద్‌లోని చారిత్రక మసీదులు, మ్యూజియంలను లక్ష్యంగా చేసుకుని పెద్ద ఎత్తున దొంగతనాలు జరిగాయి. భక్తుల రూపంలో మరియు సాధారణ పౌరుల రూపంలో చొరబడిన దొంగలు శతాబ్దాల నాటి అరుదైన ఇస్లామిక్ కాలిగ్రఫీ బోర్డులను, ప్రాచీన పవిత్ర ఖురాన్ ప్రతులను మసీదుల నుండి దొంగిలించి అంతర్జాతీయ నల్లబజారుకు తరలించారు. అలాగే 2013-2015 మధ్య కాలంలో సిరియా మరియు ఇరాక్ ప్రాంతాలలో ఐసిస్ ఉగ్రవాదులు వందల ఏళ్ల నాటి చారిత్రక మసీదులు, సూఫీ దర్గాలపై దాడులు చేసి, అక్కడి విలువైన ప్రాచీన ఇస్లామిక్ శిల్పాలు, చారిత్రక పత్రాలు మరియు పురాతన నాణేలను దొంగిలించి, తమ సంస్థ నిర్వహణ కోసం విదేశాల్లో అమ్ముకున్నారు. ఇటీవలి కాలంలో 2016 డిసెంబర్లో ఈజిప్ట్ రాజధాని కైరోలోని ప్రసిద్ధ చారిత్రక 'అల్-రిఫాయ్ మసీదు' లోకి భక్తుల వలె ప్రవేశించిన కొందరు వ్యక్తులు ప్రార్థనలు చేసుకుంటున్నట్లు నటించారు. లోపల భద్రతా సిబ్బంది కళ్ళు గప్పి, మసీదు గోడలకు అలంకరించి ఉన్న మామ్లుక్ కాలం నాటి అత్యంత అరుదైన ఆరు చారిత్రక ఇస్లామిక్ లాంతర్లను విరగ్గొట్టి దొంగిలించారు. ఆ తర్వాత 2018 ఆగస్టులో లడఖ్ లోని పురాతనమైన 'హజ్రత్ మీర్ అమీర్ కబీర్ మసీదు'లో లాకర్ను పగలగొట్టి, భక్తులు సమర్పించిన విరాళాల సొమ్ము మొత్తాన్ని దొంగిలించి పరారయ్యారు. ఇది నైతికత లేని భక్తికి పరాకాష్ట కాదా...? !

అల్లా..... ఎంకన్న....యేసునాయనా.... మీ ఆలయాల్లో దొంగ భక్తులను దీవించుదురు గాకా...!

•

# వైరస్‌లతో మన వైరం

**- డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్**

వైరస్ అనేది జీవపదార్థమా కాదా అనే చర్చ ఎప్పటినుంచో జరుగుతూ వస్తున్నదే. కొన్ని విషయాల్లో అది రోబట్‌లాగా పనిచేస్తుంది. అంతేకాదు; అది కంప్యూటర్ల సహాయంతో మరిన్ని రోబట్లను తయారు చెయ్యగలిగిన రోబట్‌లాగా ప్రవర్తిస్తుంది. వైరస్ల ఉనికి అవి క్రితం సారి "ఆశ్రయం పొంది" పెరిగిన జీవకణమే. బైటికొచ్చిన వైరస్ కణాలన్నీ మరొక స్థావరం దొరికేదాకా అచేతనంగా ఉండిపోతాయి. ఇలా అవకాశమున్నప్పుడల్లా "జీవిస్తూ" తక్కిన సమయాల్లో నిర్జీవంగా పడి ఉండే వైరస్ నిజంగా జీవ, నిర్జీవపదార్థాల మధ్య సరిహద్దు వంటిది.

కొన్ని రకాల వైరస్ల వల్ల రోగలక్షణాలేవీ కలగవు. నిజానికి మనకు తెలిసిన దాదాపు 1000-1500 రకాలలో రోగాలు తెప్పించేవి 250 మాత్రమే. వీటిలో కూడా మనుషులను బాధించేవి సుమారు వంద రకాల మాత్రమే ఉంటాయి. గాలితో వచ్చే జలుబూ, ఆటలమ్మ, జీర్ణాశయం ద్వారా కలిగే పోలియో వగైరాలూ, చర్మం స్పర్శ ద్వారా సోకే హెచ్‌ఐవీ వంటివీ, జననేంద్రియాలకు సంక్రమించే హెర్పిస్ (దీనికి మందు లేదు) ఇలా వేరువేరు వైరస్లున్నాయి. పొంగు, విరోచనాలు, గవదబిళ్ళల వాపు వగైరాలు రావడంకూడా వైరస్ల చలవే. మెదడువాపుకు కారణమైన వైరస్ ముందర ఏ పక్షుల్లోనో ఉంటుంది. వాటిని కుట్టిన దోమల లాలాజలంలో ఆ ప్రాణాంతకమైన వైరస్ పెరిగి, ఆ తరువాత వాటి కాటుద్వారా ఇతర జంతువులకూ, మనుషులకూ కూడా సోకుతుంది.. శరీరంలో ఒకచోట చేరిన వైరస్లు రక్త ప్రసరణం, లేదా నాడీవ్యవస్థ ద్వారా ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించగలవు.

మామూలు జలుబువంటివి ప్రమాదకరం కాకపోయినా చాలా నీరసపెడతాయి. వీటి కారణంగా ఎంతమంది ఉద్యోగులు సెలవలు పెడతారో, అందువల్ల కంపెనీలకు ఎన్ని కోట్ల డాలర్లు నష్టం వస్తుందో పారిశ్రామిక దేశాల్లో లెక్కలు కడుతూంటారు. జలుబు చేసినవారు తరుచుగా సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం, తమ ఊపిరి ద్వారా వైరస్ తాము ఉన్న గదుల్లో పేరుకోకుండా గాలి తగిలేట్టుగా చూసుకోవడం మొదలైన మామూలు జాగ్రత్తలు పాటించినట్టయితే సమస్యలు చాలావరకూ తగ్గుతాయి.

ఈ రోజుల్లో వైరస్లు తెచ్చే తక్కిన రోగాలన్నీ ఒక ఎత్తూ, ఎయిడ్స్ ఒక ఎత్తూ అనిపించడంలో ఆశ్చర్యంలేదు. అక్వైయిర్డ్ ఇమ్యూనో డిఫిషెన్సీ సిండ్రోమ్ అనే పేరుగల ఈ రుగ్మత వ్యాధి కాకపోయినా, శరీరాన్ని ఇతర వ్యాధుల బారిన పడకుండా ఉంచే నిరోధక వ్యవస్థను ధ్వంసం చేసేస్తుంది. దీనికి తగిన మందు లేదేమోననే భయంవల్ల ప్రజల్లో సహజంగా ఎంతో ఆందోళన కలుగుతోంది. మన రోగనిరోధక వ్యవస్థలో రక్తంలో ఉండే తెల్ల కణాలు అతి సమర్థవంతమయినని. ఎయిడ్స్ వైరస్ వీటిలో టీ-4 అనే లింఫోసైట్ కణాలపై దాడి చేస్తుంది. రోగాలని నిరోధించలేని పరిస్థితిలో చాలామంది ఒకరకం న్యుమోనియా వల్లనో, కొన్ని రకాల కేన్సర్ల వల్లనో తీవ్రంగా జబ్బుపడి ప్రాణాపాయానికి లోనవుతారు. నాడీమండలం దెబ్బతినడం, విపరీతంగా బరువు తగ్గిపోవడం మొదలైన లక్షణాలన్నీ చివరి దశలో కనబడతాయి. ఈ రోగపు లక్షణాలు పూర్తిగా కనబడడానికి పదేళ్ళకు పైగా కూడా పట్టవచ్చు. లైంగిక సంబంధంతోనో, కలుషిత రక్తం ద్వారానో వచ్చే ఈ

సమస్య తల్లి పాలనుంచి శిశువులకు కూడా సోకుతుంది. ప్రస్తుతం వాడకంలో ఉన్న మందులు రోగుల ఆయుష్షును పెంచగలవుకాని పూర్తి చికిత్సను సాధించలేకుండా ఉన్నాయి. జీవనశైలిని నియంత్రించుకుని ఈ పరిస్థితి రాకుండా జాగ్రత్త పడడమే ముఖ్యమని భావిస్తున్నారు.

జీవకణాల వెలుపట వైరస్లు కొన్ని గంటల కన్నా బతకలేవు. అందువల్లనే కొన్ని రోగాలు అకస్మాత్తుగా కొంతమందికి వచ్చి, వారంతా చనిపోగానే ఆ వైరస్కు "నిలువ నీడ లేకపోవటంతో" అంత అకస్మాత్తుగానూ అంతర్ధానమైపోతూ ఉంటాయి. వీటిలో చాలామటుకు కొన్ని అడవి జంతువుల్లోనూ, కొందరు మనుషుల శరీరాల్లోనూ నిద్రాణంగా ఉంటాయి. ఈ లోపల అవి కొన్ని మ్యుటేషన్లకు కూడా లోనయి, జన్యుపరమైన మార్పులతో ఉన్నట్టుండి మనకు ప్రమాదకరమైన రూపాల్లో విజృంభించవచ్చు. ఉదాహరణకు 1959లో ఏదో వింత రోగంతో చనిపోయిన ఒక బ్రిటిష్ నావికుడు ఎయిడ్స్ వ్యాధికి బలైనట్టుగా ఆధునిక పరిశోధకులు అనుమానిస్తున్నారు. అదే నిజమైతే దాని వైరస్ దాదాపు 20 ఏళ్ళపాటు నిద్రాణంగా ఉందని అనుకోవాలి.

కొత్త రోగాలన్నీ ఎక్కువగా ఆఫ్రికా, ఆసియావంటి "వెనకపడ్డ" ప్రాంతాల్లోనే మొదలై విమానాలద్వారా పశ్చిమ దేశాలకు దిగుమతి అవుతాయని అక్కడి శాస్త్రవేత్తల అనుమానం. ఇందుకు కారణం విదేశీ యాత్రికులు మాత్రమే కాదనీ, విమానాల్లోని గాలికూడా కలుషితం అయి, రోగక్రిములను మోసుకొస్తుందనీ వారు భయపడుతూ ఉంటారు. వీటిని బలపరిచే వార్తలూ ఉన్నాయి. ఉదాహరణకు ఆసియాలోని కొన్ని దేశాలలోనూ, మన దేశంలోనూ మంచినీరూ, మరుగుదొడ్ల పరిశుభ్రతా ప్రాథమికస్థాయిలో కూడా అందుబాటులో లేని ప్రాంతాలున్నాయనీ, ఈ విషయంలో మనవాళ్ళ పరిస్థితి పేద ఆఫ్రికన్ దేశాలకన్నా కూడా కనాకష్టంగా ఉందనీ ఈ మధ్యనే ఒక ప్రకటన వెలువడింది. మన రాజకీయ నాయకులు తమ ప్రభుత్వం పడిపోయేలోగా హడావిడిగా డబ్బు వెనకేసుకోవడంలో చూపించినంత ఉత్సాహం "అలగా జనం" గురించి ఎందుకు చూపుతారు?

భూమిమీద వైరస్లు మొదట ఎలా ఆవిర్భవించాయనేదాన్ని గురించిన కొన్ని ప్రతిపాదన లున్నాయి. అతిప్రాచీనమైన పరాన్నభుక్కులవంటి కొన్ని కణాలనుంచి ఇవి రూపొందాయనీ, జీవపదార్థపు పునరుత్పత్తికీ, ఇతర ప్రాంతాలకు ప్రసారం కావటానికీ అవసరమైన లక్షణాలు మాత్రమే వీటిలో మిగిలాయనీ కొందరు అంటారు. అలా కాదనీ, ఇవి మామూలు జీవకణాల నుంచి కనీస అవసరాలకు తగిన పదార్థాలతో బైటపడ్డాయని మరికొందరి అభిప్రాయం. ప్రోటీన్లనూ, ఎన్జైములనూ తయారుచెయ్యడానికి సూచనలు అందించగలిగి, పునరుత్పత్తిని సాధించే ఆర్ఎన్ఏ కణాలనుంచి వైరస్లు పుట్టుకొచ్చాయనే సిద్ధాంతమూ ఉంది. వైరస్లు ఎప్పటికప్పుడు మ్యుటేషన్ల ద్వారా మార్పులు సంతరించుకుంటూ, జీవపరిణామ సిద్ధాంతం ప్రకారం ప్రమాదాల నుంచి తప్పించుకుంటూ ఉంటాయి. వైరస్లు పుట్టుకొచ్చాయనే సిద్ధాంతమూ ఉంది. వైరస్లు ఎప్పటికప్పుడు మ్యుటేషన్ల ద్వారా మార్పులు సంతరించుకుంటూ, జీవపరిణామ సిద్ధాంతం ప్రకారం ప్రమాదాలనుంచి తప్పించుకుంటూ ఉంటాయి. వైరస్లుకూడా బాక్టీరియాలాగే తాము ఆక్రమించిన ప్రాణి శరీరం చచ్చిపోకుండా చూస్తాయి. అందుకు తగిన విధంగా వాటిలో జన్యుపరమైన మార్పులు జరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన ఎయిడ్స్ వైరస్ కూడా కాలక్రమేణా మనుషులకు నిరపాయమైనదిగా మారిపోవచ్చునే ఆశ ఉంది. ఎటొచ్చీ ఇది జరగడానికి శతాబ్దాలు పట్టినా పట్టవచ్చు.

# మహాకవి జాషువా వర్గ దృష్టి

- అద్దేపల్లి రామమోహనరావు

మహాకవి జాషువా భావ కవితోద్యమ కాలంలోనూ, అభ్యుదయ కవితోద్యమ కాలంలోనూ, చైతన్యవంతంగా కవిత్వం రాసినవారు. భావ కవితా రీతితో ప్రభావితుడైనా, తన ప్రత్యేకత ప్రతిఫలించే భావకవిత్వం రాశారు. అలాగే అభ్యుదయ కవిత్వం కూడా ఆయనపై ప్రభావం చూపింది. అభ్యుదయ కవిత్వానికి నేపథ్యమైన మార్క్సిస్టు దృక్పథాన్ని ఆయన స్వీకరించలేదు గాని, అభ్యుదయ కవిత్వానికి ప్రధానమైన భావధారలన్నిటి చైతన్యమూ ఆయన కవిత్వంలో పరుచుకుని ఉంది.

1970ల నుండి తెలుగు కవిత్వంలో మార్క్సిస్టు దృక్పథానికి ఒక నిబద్ధత వచ్చింది. అసలు అప్పటి నుండే తెలుగు సాహిత్యంలో అన్ని భావధారల గూర్చిన అవగాహనకీ స్పష్టత ఏర్పడింది. మార్క్సిస్టు సిద్ధాంతాల గూర్చి మాత్రమేగాక అన్ని సామాజిక సిద్ధాంతాల మీదా వాదోపవాదాలు ప్రారంభమయినై. ఒక వ్యక్తిలోని సంకీర్ణ భావాలు, పరస్పర వైరుధ్యం గల ఆలోచనలు అంగీకరించగల పరిస్థితి పోయింది. మార్క్సిస్టు భావధార విషయం గూడా అంతే. అంతకుముందు సంకీర్ణ భావధారల్ని ఎవరూ విమర్శకీ ప్రత్యేక అంశంగా పరిగణింపలేదు. శ్రీశ్రీ దగ్గర నుండి అభ్యుదయ కవులందరిలో సంకీర్ణమైన భావధారలున్నై. ఈనాటి కొంతమంది విమర్శకులు, నిబద్ధతా సిద్ధాంతాలు రాకముందున్న రచయితల్లో, ఈనాటికి అవసరమైన భావాలు ఏవని విమర్శించడం, కాలస్థల పరిమితుల్ని గుర్తించని, గతితర్క రహిత దృష్టి మాత్రమే అని చెప్పాలి. శ్రీశ్రీ మొదలైన కవులు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని విశ్వసించినవారు, మార్క్సిస్టు ఉద్యమాల్ని సమర్థించినవారు. జాషువా మార్క్సిస్టు నేపథ్యంలో కవిత్వం రాసినవారు కాదు. కాని అభ్యుదయ ఆవేశాన్ని నిండుగా స్వీకరించారు.

సంకీర్ణ భావధారలున్న ఆనాటి కవుల్ని అంచనా వేసేటప్పుడు, వారిలోని మౌలికావేశాల్ని గ్రహించడం అత్యవసరం. జాషువాకి గాంధీ తత్వంమీద, సంప్రదాయం మీద, పురాణేతిహాసాల మీద గౌరవదృష్టి ఉండి ఉండవచ్చు. కాని ఆయనలో మౌలికావేశాలు అభ్యుదయ నేపథ్యం కలిగినవే. ఆయన స్వీయ ముద్ర (Identity) నిజానికి ఆ నేపథ్యంలోనే ఉంది. అలా ఉండడానికి తగిన జీవితం ఆయనకుంది. పాండిత్యం వల్లగాని, ఆకర్షణవల్ల గాని, కీర్తికాంక్షతోగాని ఆయనకి ఆ ఆవేశాలు ఏర్పడలేదు. అవి, తన జీవితానుభవాలవల్ల సహజంగా ఆయనలో వికసించినవి. వర్గ దృష్టి ఏర్పడ్డానికి ఆయనకి ఏ చదువులూ అక్కర్లేదు. పీడితవర్గానికి చెంది, ఆర్థిక, సాంస్కృతిక, సామాజికమైన అణచివేతకు గురైన వారు కాబట్టి, వర్గ స్పృహ ఆయనలో అత్యంత సహజంగా రూపుదిద్దుకుంది. తనపై ప్రభావం కలిగించిన ప్రాచీన, భావ కవిత్వాల రీతుల్ని అనుసరిస్తూనే, ఆయన తనలోని వర్గకసికి సరైన వ్యక్తీకరణ చెయ్యగలిగాడు. అంతేగాక, ఆయన చుట్టూ ప్రచలితంగా ఉన్న మార్క్సిస్టు భావాలలోని పరిష్కార భాగంకాక, సిద్ధాంత భాగం ఆయన మీద ప్రభావం చూపి కూడా ఉండాలి. పీడిత వర్గానికి చెందిన వ్యక్తిలో ఎటువంటి సంకీర్ణ భావాలున్నా, పీడితుల్ని పట్టించుకునే మార్క్సిస్టు భావాలు తప్పక ఆకర్షిస్తాయి. మహాకవి జాషువా మీద

అభ్యుదయ భావాల పరోక్ష ప్రభావం ఉండి ఉండాలి. ఆయన రచనల్లోని వర్గస్పృహను గూర్చి పరిశీలన చేస్తే, ఈ విషయం చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ఆనాటి మరే యితర భావకవిలోనూ, పద్యకవిలోనూ ఈ విశేషం కనిపించదు.

వర్గస్పృహ కలిగిన కవికి, సమాజంలో రెండువర్గాలు ఉన్నై అనేది స్పష్టంగా కనిపిస్తుంది. ఒకటి దోపిడిచేసే వర్గం. రెండోది దోపిడికి గురికాబడే వర్గం. దోపిడిచేసే వర్గాలు, రాచరిక, భూస్వామ్య, పెట్టుబడిదారీ భావజాలంతో దోచుకుంటై. ఈ భావజాలం మీద జాషువాకి విపరీతమైన ఆగ్రహం ఉంది. ఆ ఆగ్రహాన్ని అనేక చోట్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వ్యక్తీకరిస్తాడు. రాచరికానికి దురహంకారం, దుర్మార్గం, ఎంత గొప్ప ప్రతిభ కలవాణ్ణైనా బానిసగా భావించడం, తన కోరికని తీర్చడానికి ప్రజలందరూ ఉన్నారనుకోవడం – ఇలాటివన్నీ ప్రధానమైన లక్షణాలు. వీటన్నిటినీ జాషువా 'ఫిరదౌసీ' కావ్యంలో తుత్తునియలు చేశాడు.

గజనీ మహమ్మదు క్రూరత్వాన్ని, ఎన్నో పద్యాల్లో వర్ణించినా రానంత స్పందనని, కవి ఒక్క పాదంలో ధ్వని పూర్వకంగా చెప్తాడు.

**పదియునెదిమిది విజయరంభల వరించి**
**గంగా జలమున నెత్తుటి కత్తి కడిగి**

గంగానది భారతీయులకి అత్యంత ఆరాధ్యమైన నది. వేలమంది భారతీయుల్ని చంపిన కత్తిని గంగాజలంలో కడుక్కున్నాడనడంలో, రాజు క్రౌర్యం అనిర్వచనీయమైన ధ్వని ద్వారా వ్యక్తమౌతోంది. జాషువా రచనలోని ధ్వని ఎక్కడైనా యింత అప్రయత్న పూర్వకంగానే ఉంటుంది.

ఒక్కొక్క పద్యానికీ ఒక్కొక్క బంగారు నాణాన్ని యిస్తానన్న రాజు, కావ్యమంతా విని ఎంతో స్పందించి, చివరికి వెండి నాణాలు పంపాడు. కుంగిపోయిన ఫిరదౌసి, ధనం తిప్పి పంపించేసి, చాలా ఆగ్రహంతో రాజుకి ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో, కవికి రాచరికం మీద ఉన్న కోపం వ్యక్తమౌతుంది. ఈ పద్యాలు 'ఫిరదౌసి' కావ్యానికి ఆత్మ లాంటివి. ఎందుకంటే ఈ కావ్యంలో రాచరికంలోని దుర్మార్గ లక్షణాల్ని నిరూపించడమే మహాకవి లక్ష్యం కాబట్టి. ఫిరదౌసి తన లేఖలో ఒక పద్యంలో యిలా అంటాడు.

**పూనికరాసికిన్ మనుజ భుక్తి యొసంగెడు**
**రాతిగుండె సుల్తానులకు**
**అస్మదీయ కవితాసుధ చిందిన పాతకంబు**
**నాపై నటనం బొనర్చినది**

జాషువాకి రాచరికంమీద ఉన్న కసి అంతా విచిత్రంగా ఒక ప్రయోగం ద్వారా వ్యక్తమౌతుంది. అందరూ తనకి బానిసలే అని రాచరికం అహంకరిస్తుంది. దాన్ని ఈ క్రింది తిప్పికొట్టిన విధానం అద్భుతం.

**చిరముగ బానిసీని నభిషేక మొనర్చితి**
**మల్లెపూవు టత్తరు లొలికించి**
**మాయ జులతారునరాదు గదా పసిండి...**

ఫిరదౌసి, తానే ఒక బానిసకి అభిషేకం చేశానంటున్నాడు. రాజునే 'బానిస' అనడం, రాచరికాహంకారానికి ఎంత ఎదురుదెబ్బ!

అవతలి వారిది అపరాధం అనుకుంటే, వాణ్ణి చంపెయ్యడం రాచరికం లక్షణం. అపరాధం తనదైనా అవతలివాడు, అదే మహద్భాగ్యం అని శిరసావహించవలసిందే. అందుకే రాజుకి, వెండినాణాలు తిరస్కరించినప్పుడు కోపం వచ్చింది. పైగా తనని దూషించిన లేఖ విని యింకా కోపం వచ్చింది. అందుకే......

**ఆకంఠంబుగా క్రోధమెక్కిన**
**వ్రేటుగొనుకోడె పెద్దపులి మాడ్కికలేచి**
**సేనాపతిన్గని**
**ఫిర్దౌసిని పట్టి చంపుడని**
**ఆజ్ఞాపించె నుద్దండతన్**

చివరికి రాజులో పశ్చాత్తాపం కలిగి, మళ్ళీ బంగారు నాణాలు కవి యింటికి పంపినా, ఆయన కుమార్తెతో, కవి తిరిగి పంపేటట్లు చేశాడు. అంతేగాక కావ్యం ముగిస్తూ కూడా

**గజనీ పట్టణ వీధులన్**
**నృపుని కంకాళంబు సప్రాణమై**
**రజనీ మధ్యమునందు క్రుమ్మరుచు**
**ఆర్త ధ్వానముల్ చేయు**

అన్నాడు. ఇలా రాచరికం లక్షణాల మీద ఉన్న తన ఆగ్రహాన్నంతా, 'ఫిరదౌసి' కవి మీద పెట్టి, మహాకవి జాషువా వ్యక్తపరిచాడు. ఈ కావ్యంలోని రాజు, దుర్మార్గ రాచరికాని కంతటికీ ప్రతీక.

భూస్వామ్య విధానం వల్ల కలిగిన అనర్థాలన్నీ జాషువా పద్యాల్లో కనిపిస్తే. శ్రమదోపిడికి మొట్టమొదటగా గురైన కులంలో పుట్టిన జాషువాకి ఈ అనర్థాలన్నీ అనుభవ పూర్వకమే. ఆయన పద్యాల్లో అక్కడక్కడ దైవభక్తి కనిపించినా, మానవతా దృష్టి దగ్గరకి వచ్చేటప్పటికి మతంతో రాజీలేదు. అన్నిమతాల్ని విమర్శిస్తాడు. పైగా 'నేను కులమతాల చేత కట్టుపడను' అని బాహాటంగా చెప్పుకున్నాడు. మత భావాల్ని విమర్శించేటప్పుడు, వాటి వెనుకనున్న ఆర్థిక నేపథ్యాన్ని స్ఫుటంగా చెప్పడం జాషువా మౌలికావేశాల్లోని వర్గ దృష్టికి నిదర్శనం. ఉదాహరణకి ఈ పద్యం తీసుకోవచ్చు.

**'ప్రతిమల పెళ్ళి చేయుటకు**
**వందలు వేలు వ్యయింత్రుగాని**
**దుఃఖిత మతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రికన్**
**మెతుకు విదల్పదీ భారతమేదిని**
**ముప్పది మూడుకోట్ల దేవత లెగబడ్డ దేశమున**
**భాగ్యవిహీనుల క్షుత్తులారునే!**

'భాగ్యవిహీనుల క్షుత్తు'మీదనే ఎప్పుడూ జాషువా ప్రధాన దృష్టి. దాదాపు ఆయన అన్ని కావ్యాల్లో ఈ విషయం స్పష్టంగా కనిపిస్తుంది. ఆకలితో ఉన్నవారిని ఆదుకోవడం కంటే గొప్ప విషయం లేదని ఆయన అన్నికావ్యాల్లోనూ ఎక్కడో ఒక చోట చెప్తూనే ఉంటారు. 'ఆకలి' మీద యింతటి

కేంద్రీకరణ అభ్యుదయావేశానికి మొదటి గుర్తు. పేదరికం ప్రసక్తిలేకుండా జాషువా కావ్యం ఉండదు. 'స్వప్నకథ'లో ఒక చోట యిలా అంటారు.

**పేదరికము పెద్ద వింత విద్యాశాల**
**దానిలోని లజ్జ గానబడదు**
**ఉదర మొజ్జయగుచు ఓరంత ప్రొద్దులునోర్మి**
**విద్దె నేర్పుచుండునచట**

ఆకలి గురించి యింత తెలిసిన కవికి, చాలా సహజంగా, ఉన్నవారికీ-లేనివారికీ ఉన్న తేడా హృదయాన్ని కలచివేస్తుంది. ఈ భావన కూడా జాషువాలో అడుగడుగునా కనిపిస్తుంది. 'స్వప్నకథ'లోనే మరోచోట యిలా అంటారు.

**ఒకడు చిన్నమ్మ కరడోల నూగుచుండ**
**ఒకడు పెద్దమ్మ కటికి దృష్టికి తపించు**
**ప్రకృతి జనయిత్రి అనుగు గారాల సుతుల**
**ఒకని ద్వేషించు**
**ఒకని అభ్యుద్ధరించు**

చిన్నప్పటి నుండియు నాకన్ను పరుల కష్టములను గని ఓరువలేదు'అని ఒక స్త్రీ ద్వారా చెప్పించిన మాటలు తనను గూర్చి కవి అన్నవే అనుకోవచ్చు.

తన కులం కారణంగా సమాజంలో దారుణమైన అవమానాలకు గురైన జాషువాకి, దళితుల అణచివేతపై కలిగిన ఆగ్రహం ఎంత తీవ్రమైనదో ఊహించుకోగలం. ఆయన కవిత్వంలో ఈ ఆగ్రహం ఒక బలమైన అభివ్యక్తి పొందింది. దళితుల అణచివేతను గూర్చి 20వ శతాబ్ది మొదటి నించీ, తెలుగులో వచ్చిన కవిత్వాన్ని పరిశీలిస్తే, మహాకవి జాషువా ఆ విషయంలో తెచ్చిన మలుపు ప్రత్యేకమైంది. పైకి కొన్ని పద్యాల్లో కరుణమయంగానూ, కొన్నిటిలో సామరస్యంగానూ, వేదనతోనూ చెప్తున్నట్లు కనిపించినా, జాషువా ముద్ర ప్రతిఘటన పూర్వకమైన ఆగ్రహాన్ని ప్రకటించడంలోనే ఉంది.

**క్రూరుల్ కుత్సితులు**
**అస్మదీయములు హక్కుల్ దోచుకొన్నారు**
**నన్నూరింబైటన్ నెట్టినారు**
**ఇపుడు నన్నోదార్చుచున్నారు**

"ఈ దేశంలో శ్రమవిభజన కాదు, శ్రామికుల విభజన జరిగింది' అన్నారు డా॥ అంబేద్కర్. ఎక్కడ దళిత ప్రసక్తి వచ్చినా, దళితుని శ్రమ దోపిడి గూర్చి చెప్పడం జాషువాలో తీవ్రంగా కనిపిస్తుంది. దళితుని శ్రమంతా భూమి నాశ్రయించుకుని ఉన్నదే. ఈ విషయాన్ని ఎంతో తీవ్రంగా చెప్పడం, వర్ణానికున్న వర్గ లక్షణాన్ని స్పష్టంగా గుర్తించడమౌతుంది.

**వాని రెక్కల కష్టంబు లేనినాడు**
**సస్యరమ పండి పులకింప సంశయించు**
**వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు భోజనము పెట్టు**
**వానికి భుక్తిలేదు**

పరాయీకరణకు గురైన దళితుణ్ణి వర్ణించడం గమనించదగింది.

వర్గభేదాన్ని గూర్చి చెప్పడమే కాకుండా, ఉన్నత వర్గం పేదవర్గాన్ని చేసే దోపిడిని కూడా సరిగ్గా అభ్యుదయ కవులలాగానే చెప్తారు జాషువా.

**ఎవడారగించు అమృత భోజనంబున కలిసెన్**
**ఈ లేమ గంజి బువ్వ**
**ఎవడు వాసముచేయు శృంగార సౌధాన మునిగెన్**
**ఇన్నారి పూరిగుడిసె**
**ఎవని దేహము మీది ధవళాంబరములలో నొదిగెన్**
**ఇన్నాతి ముదుకపంచె**
**ఎవడి దేహము సేర్చు మృదుతల్పములలోన నక్కెనో**
**ఈయమ్మ కుక్కిపడక**
**వసుధపైనున్న భోగసర్వస్వమునకు**
**స్వామిత వహించి మనుజుండు ప్రభావమందు**
**ఎవడపహరించె**
**ఏమయ్యె దీని సుఖము?**

అభ్యుదయావేశానికి పరాకాష్ట రాజకీయ దృక్పథం. రాజకీయ విషయంలో జాషువా గాంధీ సిద్ధాంతాలపై అభిమానం గల వారైనప్పటికీ, పేదవారికీ గొప్పవారికీ భేదాన్ని పెంచే రాజకీయాన్ని తీవ్రంగా ద్వేషించినవారు. బ్రిటిషువారు ఈ దేశాన్ని వదిలివెళ్లిన తర్వాత, నల్లదొంగల చేతిలో వ్యవస్థ ఎంత అవినీతి మయమయిందో, 'స్వయంవరం' కావ్యంలో చాలా వ్యంగ్యంగా వర్ణిస్తారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎట్లా ధనికవర్గాన్ని తయారు చేస్తుందో చెప్తారు. ఈ విషయంలోని అనేక కోణాల్ని స్పృశిస్తారు. ఉదాహరణకి రెండు అంశాలు.

**తెలవారేలేడ్చి చేయునాడు ఇతడు మంత్రిత్వంబు సాధించి**
**ఆప్తులకున్ దగ్గరి చుట్టపక్కముల కుద్యోగంబు లిప్పించి**
**అన్యుల కన్యాయము చేసినాడనుచు విందున్**
**వర్ణ విద్వేషముల్ పులులై**
**ఎంతటి సత్కళారమల గొంతుల్ నొక్కి భక్షించెన్**
**అటకాయించెడు శాసనాల చెవులల్లాడించుచున్**
**బ్లాకు మార్కెటు సాగించు బేహారిమిన్న ఇతడు**
**ఆర్పెన్ పెక్కు సంసారముల్**
**చిటికెండంత దయారసంబు**
**ఇతని కుక్షిన్ చీల్చినం గానము**
**ఇక్కుటిలుండు ఉత్తమ దేశభక్తుడని**
**పల్కుక పత్రికా రాజముల్**

ఎక్కడో ఒకటి రెండు చోట్ల కొన్ని అంశాలు కనిపిస్తే, ఆశ్చర్యం లేదు. కాని అభ్యుదయావేశం అన్ని సూక్ష్మ వివరాలతో కవిత్వం నిండా అంతర్వాహినిగా ఉండటం, మహాకవి జాషువాలోని విశిష్టత.

ఇలా సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో వర్గ దృక్పథం మహాకవి జాషువాలో నిర్దిష్టంగా ఉంది. ఆయన గాంధీ సిద్ధాంతాన్నీ, మానవతా సూత్రాల్నీ, కరుణరస ప్రాధాన్యాన్నీ విశ్వసించినవారే. అయినా ఆయన జీవితానుభవాలు, సామాజిక స్పందనా ఆయనలో అభ్యుదయావేశాన్ని రగిలించినై. దేవుడి మీద నమ్మకాన్ని చెప్పినప్పటికంటే, దేవుడి పేరు మీద జరిగే అన్యాయాల్ని వర్ణించేటప్పుడు హేతువాదికి దగ్గరగా వస్తారు. గాంధీ సిద్ధాంతాన్ని నమ్మినా, నల్లదొంగల అన్యాయాల్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్తారు. మానవతా, కరుణభావాల్ని రూపుగట్టినా, పేదతనాన్నీ, కులం కారణమైన అణిచివేతనీ, ధనికవర్గాల దోపిడీని ప్రతిఘటన పూర్వదశయైన ఆగ్రహంతో వర్ణిస్తారు. మార్క్సిస్టు పరిష్కారాన్ని ఆయన విశ్వసించకపోయినా, మౌలికమైన, నిజాయితీతో కూడిన ఆవేశాలన్నీ, ప్రథమశ్రేణి అభ్యుదయ కవులకి తీసిపోకుండా ఉంటై. వర్గ దృక్పథం అడుగడుగునా కనిపిస్తుంది.

1970ల నుండి విప్లవోద్యమం రాకపోతే శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గురించి ఎన్ని సమీక్షలొచ్చేవో తెలియదు. శ్రీశ్రీ కవిత్వంలో ఎన్ని భరించరాని సంకీర్ణతలున్నా, నిబద్ధతా సిద్ధాంతం వచ్చిన తర్వాత, 'మహాప్రస్థానం'లోని నిబద్ధత కలిగిన పదిలోపు కవితలపై ప్రగతిశీల సమీక్షలు అసంఖ్యాకంగా వచ్చినై. అలాగే ప్రస్తుత దళితోద్యమ నేపథ్యంలో, జాషువాలోని ప్రగతిశీల భావాల్ని గూర్చి ఎంతో పరిశీలన జరగవలసి ఉంది. ప్రగతిశీల భావాలకు సరిగ్గా సరిపోయిన ప్రజాశైలిలో, అద్భుతమైన అభివ్యక్తితో పద్యాలు చెప్పినవారు ఆయన ఒక్కరే.

*('జాషువా కవితా తత్త్వం' పుస్తకం నుండి గ్రహించడమైనది)*



**ది. 17.09.2026న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బెల్లంపల్లిలో "పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక" ఆధ్వర్యంలో పెరియార్ ఇ.వి.రామసామి 147 జయంతి వేడుకలు జరిగాయి.**

**ఈ కార్యక్రమంలో – రంగ ప్రశాంత్, అక్కు కృష్ణ, గొడిసెల చంద్రమౌళి, గొడిసెల సరిత, రవిరాణి, లక్ష్మణ్, సమ్మయ్య, రాజ్‌కుమార్, గొడిసెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.**

# స్వర్గ దర్శనం

**- వేగిరెడ్డి చంద్రశేఖరరెడ్డి**

'స్వర్గము' - ఈ పేరు వినని వారుండరు. 'అమరపురం, అమరలోకం, త్రిదివాలయం; త్రిదివం, త్రివిష్టపం: దివము; దివి అంటు అనేక పేర్లతో ఈ స్వర్గం ప్రాశస్త్యాన్ని ఎన్నోవిధాలుగా పొగడుతూ వర్ణించారు. పండితుల నుండి - పామరుల ద్వారా ఈ పేరును ప్రసిద్ధంగా చెప్పుకుంటూ వుంటారు. పౌరాణిక సాహిత్యమంతటా స్వర్గం గురించి ఎల్లెడలా ప్రముఖంగా పేర్కొన్నారు. దీనిని బట్టి 'స్వర్గం' ఎంతో గొప్పదని, పుణ్యప్రదమని పుణ్యులకు అత్యంత ముఖ్యమైనదని, దానిని చేరుకోవడమే జన్మ సాఫల్యమని, సార్థకత అని అంతటా వినవస్తున్న వినిపిస్తున్న ప్రవచనాలు!

దైవ శ్రుతులుగా (మాటలుగా) ఈ స్వర్గాన్ని వేదాలలో అనేకసార్లు పేర్కొన్నారు. అలాగే పురాణ సాహిత్యమంతటా కథలు - కథలుగా ప్రత్యేకించి పేర్కొన్నారు. ఈ కొనసాగింపులో భాగంగా .. భగవద్గీతలో కృష్ణుడు స్వర్గాన్ని వివరిస్తూ....

- యుద్ధం క్షత్రియులకు స్వర్గమునకు తెరిచిన ద్వారం వంటిది - గీత-2-32.
- రణంలో మరణించిన వారికి 'స్వర్గం' లభించును - 2-37
  (యుద్ధంలో మరణించిన వారికి స్వర్గం ద్వారాలు ఎల్లప్పుడు తెరిచే వుంటాయట)
- మోహవశునకు స్వర్గం లభింపదు (మోహవశులు జీవించివున్నా - దొరకని స్వర్గమట)
- ఆత్మయోగి 'పరమ పదము' పొందును - 8 - 12, 13
- వేద కర్మలు ఆచరించువారు స్వర్గలోకమున దివ్యభోగములు అనుభవింతురు - 9- 20

(యజ్ఞాలు చేయువారు స్వర్గసుఖాలు పొందుతారట. కనుక వేద యజ్ఞాలు చాలాపుణ్యప్రదాలట)

- నన్ను ఆశ్రయించిన వారు పరమ పదమును పొందుదురు - 18-56. (కృష్ణుడి రెకమెండేషన్ వుంటే చాలు స్వర్ణం వెళ్ళువచ్చు)

ఈ విధంగా స్వర్గము ఎలా లభిస్తుందో.. అచటి దివ్య భోగాల గురించి కృష్ణుడు గీతలో ఆసక్తికరంగా వివరించి చెపుతూ... వేద కర్మలు చేయువారు పాప రహితులై స్వర్గం కోరుకొని నేన్ను సేవించి స్వర్గాన్ని అనుభవిస్తారు - 9-20. అని వివరిస్తూ... అయితే యుద్ధాలలో మరణించిన వారికి స్వర్గం లభిస్తుందని ఒక చోట .. వేదకర్మలు ఆచరించిన వారు స్వర్గం పొందుతారని మరొక చోట ఇలా చనిపోయినవారు; ప్రాణాలున్నవారు స్వర్గం పొందుతారు అని తికమకగా రెండు విధాలుగా ప్రవచిస్తాడు.

అయితే ఈ స్వర్గం ఎలా వుంటుందో మహాభారతంలో...

"ఆ స్వర్గలోకంలో స్త్రీ - పురుషులు విచ్చల విడిగా శృంగార భోగాలు అనుభవిస్తారు. ఇది తప్పుకాదు. అక్కడి (గొప్ప) సంప్రదాయం - అచట శృంగార రసానుభూతికి ఉద్దీపన విభావాలు ఎన్నో వున్నాయి. మందార కల్ప వృక్షాలు, సుకుమారాలు అయిన పూలగుత్తులు, ఆ పూలగుత్తులలోని తేనెలను గ్రోలి మత్తిల్లి ఝుంకరించే తుమ్మెదల గాన మాధుర్యాలు, బంగారు

కొండ గుహలు, పిల్లతెమ్మెరలు, సయ్యాటలాడే నందనోద్యానవనం; వెలుగు వెల్లువ వెదజల్లే పొందామరలు వికసించే మిన్నేటి కాలువలు; ఆ మిన్నేటి తీరంలో పొందామరల నెత్తావులు గుబాళించే మణి మయ వేదికలు, వెన్నెల సొగసులు ప్రతిఫలించే ఇసుక తిన్నెలు; ముసలితనం లేని వేలుపు జంటలు విహరించే క్రీడాస్థలాలు వున్నాయి. అచ్చట స్వర్గంలో ఎడతెగని 'రతికేళీ' సౌఖ్య 'సముద్రంలో ఓలలాడవచ్చును." భార-అర- 1-363.

ఇలా ప్రతి చోట చెప్పి వివరించిన ఈ స్వర్గాన్ని... పాండవులు అరణ్యవాస కాలంలో అర్జునుడు అదే స్వర్గం వెళ్ళి అచటి దివ్య భోగములు 5 సంవత్సరాలు అనుభవించి తిరిగి అరణ్యం చేరుకొన్నాడు. - భార- అర - 4-3.

ఇంకా... స్వర్గం ఎక్కడ వుంటుంది? ఎలా వెళ్ళాలి ? అనుకొన్నవారికి..." హిమాలయాలకు ఉత్తరంగా పయనించి నాగశైలాన్ని, చైత్రరథాన్ని, పారిశేణాన్ని, హిమవంతాన్ని దాటి దేవతలు, సిద్దులు సేవించే గంధమాధనం; హంస కూటాన్ని దాటి శతశృంగ పర్వతానికి ఉత్తరభాగంలో... ఉత్తర దిక్కుగా స్వర్గానికి శ్రమ లేకుండా వెళ్ళవచ్చు (నట) భార-ఆది- 5-64.

స్వర్గం హిమాలయాలకు ఉత్తరంగా వెళ్ళితే వస్తుందని, అది ఎక్కడో కాదు. .. ఈ భూమి మీద పర్వతాలలో వున్నట్లుగా మహాభారతం వివరించి చెపుతుంది.

ఇక ఆ భారతం చెప్పిన.. ఈ కృష్ణుడు చెప్పిన దానిని బట్టి మనుజులు ఎలాగైన 'స్వర్గం' చేరుకోవచ్చు అనేది తెలుస్తుంది. కాని, కృష్ణుడు ఒక చోట "యుద్ధంలో మరణించిన వారికి స్వర్గం లభిస్తుంది" అంటాడు.- మరి మరణించినవారు స్వర్గం ఎలా చేరుకొంటారో...కృష్ణుడు చెప్పినా... చెప్పకపోయినా, మరణం తర్వాత దేహం బూడిదగానో, మట్టిగానో మరో పదార్థ రూపం చెందుతుంది. ఇక స్వర్గం ఎవరు? ఎలా? చేరుతారు? అనే ప్రశ్న! మరి కృష్ణుడు చెప్పేవి బూటకపు మాటలా?...

ఇదే స్వర్గాన్ని గురించి కృష్ణుడు మరొక చోట ..."వేదాలు త్రిగుణాత్మకమైన భోగాలను గూర్చి చెప్పే మాటలందు ఆసక్తిని త్యజింపవలెను" -2-45; "కర్మఫలాలను ప్రశంసించే వేదవాక్యాలందు ప్రీతితో... స్వర్గమునకు మించినది ఏదీ లేదని భావించటం క్షణిక భోగాసక్తులగు మూర్ఖుల పని కాన వానిని వదలి వేయవలెను"- 2 - 42, 44, అంటూ వేదకర్మలు మంచివి కాదంటూ ...ఆ లభించే సర్గభోగాలు - ఆశ మూర్ఖులు తలచే పనులు అని ముందు చెప్పిన దానికి భిన్నంగా ఇక్కడ చెప్పడం జరిగింది.

ఇక చివరగా భారతంలో నిజం చెప్పక తప్పుదు అన్నట్లుగా...

**కం॥** "స్వర్గ నరకమ్ము లింద్రియ
వర్గ సమాచరణముసన వచ్చును
వినవే స్వర్గమగు దన్నివారణ
దుర్గతి యగు దన్నిరోధ దుర్భలత మెయిన్!"

**తా॥** స్వర్గ-నరకాలు ఇంద్రియ సమూహ ప్రవర్తన వలన సంక్రమిస్తాయి. ఇంద్రియాలను నిగ్రహించి ఆనందంగా గడపడమే స్వర్గము అని; ఇంద్రియ నిగ్రహంలేక దుఃఖంతో కృశించటమే నరకం అని భావం. -భార- అర-5-91

ఈ విషయాన్నే బద్దెన పండితుడు..

**కం॥ తనకోపమె తన శత్రువు**
**తన శాంతమే తనకు రక్ష, దయచుట్టంబౌ**
**దన సంతోషమే స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!!**

అంటూ – సంతోషమే స్వర్గం, దుఃఖమే నరకం... అంతేకాని స్వర్గమనేది ఎక్కడో వుండే ప్రదేశమో, పట్టణమో, లోకమో కాదని ఉన్న సత్యాన్ని తెలియజేశాడు.

ఇంకో రకంగా ...

**శ్లో॥ నమోక్షో నభసః పృష్టే। న పాతాళే నభూతలే।**
**సర్వాశా సంక్షయే చేతః । క్షమో మోక్ష ఇతీర్యతే!**

– 70. అన్నపూర్ణ అధర్వ వేదం

**తా॥** 'మోక్షం' అనేది ఆకాశం వెనుకగాని; పాతాళంలో గాని, భూమి మీదగాని లేదు. ఆశా పరివృతమైన చిత్త వృత్తులను నశింప జేయడమే మోక్షం".. అని పెద్దలమాట

సత్యమైన విషయాలు ఇలా వుండగా లేని దానిని ఊహించి ఒక పేరు పెట్టి 'దేవుడు' అని ఒక్క అబద్ధమాడి దానిని ప్రచారం చేసి ఎల్లెడలా స్థాపించడం కోసం – ఇలా 'స్వర్గం'–నరకం–పుణ్యం– పాపం' అంటూ కోట్లకొలది అబద్ధాలాడవలసి వచ్చింది పూర్వమత సాహితీపరులు.

ఇలా స్వర్గం – స్వర్గం అంటు 'స్వర్గం' వెళ్ళి చవిచూసి కృష్ణుడు చెప్పడం ; అర్జునుడు వినడం విడ్డూరంగా లేదూ? మోసపూరితంగా లేదా? ఇన్ని విపరీతమైన అసత్యాలు చెప్పిన వీరు... ఈ మత గ్రంథాలు ఎలా చెలామణి అవుతున్నాయో గమనించాలి.

భాష తెలియని నాటినుండి పామర ప్రజలను పురోహితవర్గం తమ ఆధిపత్యంలో స్వర్గం' అనే భ్రమ కలిగించి, దానిని పొందే అవకాశాలుగా గుళ్ళు, గోపురాలు, వ్రతాలు, పుణ్యక్షేత్రాలు అని ఆశ చూపించి చెపుతూ సదరు భక్తి కార్యక్రమాలను వారే పూజారులుగా నిర్వహిస్తూ అమాయక ప్రజలను దోచుకొంటు తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నారు.

ఇలా ఏమీకాని – ఏమీలేని అభూతకల్పనా 'స్వర్గా'న్ని వర్ణించి చెపుతూ ఇన్ని వేల ఏండ్లుగా ప్రజలను మోసం చేస్తూనే వున్నారు పండితులు.

కనుక 'దేవుడు' ఎంత అబద్ధమో... స్వర్గం అంతే అసత్యం. దైవం అనేది భ్రాంతి, అబద్ధం, అసత్యం అని; అదొక అభూతకల్పన అని తెలుసుకున్న తరువాత నమ్మకం, విశ్వాసాలు వికటించి భక్తి బలాదూరై 'దైవం' మాయమైపోతాడు.

అప్పుడే మనిషి విజ్ఞాన దిశగా సాగి మనిషి – మనిషిని తెలుసుకొంటాడు. ప్రేమిస్తాడు. గౌరవిస్తాడు. సాక్షి మనిషేనని కర్త– కర్మ – క్రియ అతడేనని, మనిషే ఉన్నతుడని భావించి ఉన్నతోన్నతంగా జీవిస్తాడు. ●

# ముస్లిముల ఆచారాలు, దురాచారాలు

- కొత్తపల్లి రవిబాబు

**ము**స్లిములు అనగా ఇస్లాం మతాన్ని అనుసరించేవారు అని అర్థం. ఇస్లాం సూచించినవన్నీ ముస్లిములు ఆచరించడం లేదు. ముస్లిములు ఆచరిస్తున్నవన్నీ ఇస్లాం సూచించినవి కాదు. ముస్లిం మతస్తులను కొందరు తురకలు అని నిందాపూర్వకంగా పిలుస్తారు. ఎన్నో తరాల క్రింద టర్కీ దేశం నుండి ఇక్కడకు వచ్చినవారిని టర్కులని పిలిచారు. ఇప్పుడు ఇక్కడున్న ముస్లిములందరూ ఇక్కడే పుట్టి పెరిగినవారు కనుక టర్కీతో ఏ సంబంధమూ లేనివారు గనుక వారిని తురకలు అని పిలవడం సమంజసం కాదు. అదీ కాక ఈనాటి ముస్లిములు మన దేశ మూలవాసులు అనే వాదన కూడా వుంది.

ముస్లిం పండితులను మౌల్వీలు, మౌలానాలు, ముల్లాలుగా పిలుస్తారు. ముస్లిం సమాజంలో గూడా షేక్‌లు, సయ్యద్‌లు, పఠాన్‌లు, మహమ్మద్‌లు, సున్నీలు, షియాలు, ధోబీలు, మెహర్‌లు అనే విభిన్న వర్గాలున్నాయి. వీరు వారి వారి వర్గాలలోనే పెళ్లిళ్లు చేసుకుంటారు. కొందరు దీనిని పాటించరు. పై వారెవరూ నూర్ బాషాలను (దూదేకుల) పెళ్లి చేసుకోరు. వారిని పింజారిలని పిలుస్తూ అవమానిస్తారు.

ముస్లిములు పరస్పరం 'అస్సలాం అలైకుమ్' అని అభివాదం చేసుకుంటారు. దానికి జవాబుగా 'అలైకుమ్ అస్సలాం' (నీకు శాంతి కలుగుగాక) అంటారు. వారు ఈ సమస్త ప్రపంచాన్ని అల్లాహ్ సృష్టించాడనీ, ఇది ఒక వ్యవస్థీకృత పద్ధతిలో కొనసాగుతుంటుందనీ నమ్ముతారు. హిందువులు కూడా అలాగే 'శివుడాజ్ఞ లేకపోతే చీమైనా కుట్టదు' అని నమ్ముతారు. ఇస్లాంలో అదృష్టం, దురదృష్టం అనే భావనలు లేవు. అల్లాహ్ అనుమతితోనే మంచిగా×నీ, చెడుగానీ జరుగుతాయి. ఆయనే విపత్తులు సృష్టిస్తాడు. విపత్తుల నుంచి రక్షిస్తాడు అని భావిస్తారు. వివాహాన్ని నికాహ్ అంటారు. ఇది ధర్మబద్ధమైనది. బ్రహ్మచర్యాన్నీ, వైరాగ్యాన్నీ ఇస్లాం వ్యతిరేకించింది. వ్యభిచారం, వడ్డీ వ్యాపారం నిషిద్ధం. అంతే కాదు, వాస్తు పై నమ్మకం కూడా నిషిద్ధమే. జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రం, శకునాలు, తాయెత్తులు, సోది మొదలైన వాటిని ఇస్లాం తిరస్కరిస్తుంది. మూఢవిశ్వాసాలకూ, గుడ్డి నమ్మకాలకూ బదులుగా అల్లాహ్ పై నమ్మకం వుంచాలని చెబుతుంది.

కానీ, ఇమామ్‌లు, మౌల్వీలు, సూఫీలు, ముల్లాలు, పకీర్లు వీటిని పాటించకుండా భూతవైద్యం చేస్తుంటారు. జిన్‌లు (దయ్యాలు) తమ వశంలో వున్నాయనీ, వాటిద్వారా ఎటువంటి కార్యాన్నైనా సిద్ధింప చేస్తామని చెప్పి రోగుల వద్ద డబ్బు వసూలు చేస్తారు. మానసిక సమస్యలు సైతాన్ వల్ల కలుగుతాయనీ, సైతాన్‌ను తమ మంత్రబలంతో పారదోలుతామని చెబుతారు. ప్రముఖుల సమాధులు (దర్గాలు) సందర్శించడం, గంధంతో పూజలు చేయడం, తావీజులు ధరించడం, హీలింగ్ హారాలు (రోగాలను నయం చేసే హారాలు) ధరించడం లాంటివన్నీ ముస్లిముల మూఢాచారాలు.

ఇస్లామీయ కేలండర్ (అరబ్బీ)లో మొదటి నెల మొహర్రం. దీనిని షహీద్ అంటే అమరవీరుల పండుగ అనీ, పీర్ల పండుగ అనికూడా పిలుస్తారు. పీరు అంటే ఆధ్యాత్మిక గురువు అని అర్థం.

నిజానికి ఇది వర్ధంతి. పండుగ కాదు. పదిరోజుల శోకదినాలు అవి. దీని వెనుక వున్న కథ ఏమిటంటే, ప్రవక్త మహమ్మద్ చనిపోయిన తరువాత ఆయన కొడుకు హజరత్ అలీని ఖలీఫాగా ప్రజలు ఎన్నుకుంటారు. ఇస్లాం న్యాయసూత్రాల ప్రకారం రాజుకు వంశ పారంపర్య హక్కు లేదు. హజరత్ అలీ తరువాత అతని ఇద్దరు కొడుకులలో పెద్దవాడైన ఇమామ్ హసన్‌ను ప్రజలు ఖలీఫాగా ఎన్నుకున్నారు. కానీ సిరియా రాజు మానియా రాజ్యాధికారం కోరి యుద్ధం చేయడానికి తయారైనప్పుడు యుద్ధాన్ని నివారించడానికి హసన్ తన పదవిని మానియాకు అప్పచెబుతాడు. ఆ తరువాత హసన్ విషప్రయోగంతో చనిపోతాడు. మానియా తరువాత అతని కొడుకు యజీద్ రాజ్యాధికారాన్ని ప్రజలచేత ఎన్నుకోబడకుండా. వంశపారంపర్య హక్కుగా చేబడతాడు. వంశపార్యంపర హక్కును ఇస్లాం గుర్తించదు. ఈ విషయంపై యజీద్‌తో చర్చలకోసం హజరత్ అలీ రెండో కుమారుడు హుస్సైన్, తన మిత్రులు, కుటుంబ సభ్యులు, స్త్రీలు, పిల్లలు మొత్తం 72 మంది బయలుదేరి వస్తుండగా దోవలో కర్బాలా అనే చోట యజీద్ సైన్యం వారిని చుట్టుముడుతుంది. యజీద్‌ను రాజుగా అంగీకరించమని బలవంతం చేస్తారు. ప్రజాస్వామికంగా ఎన్నిక అయితేనే అంగీకరిస్తామంటారు హుస్సైన్. దానితో 10 రోజులపాటు జరిగిన యుద్ధంలో ఒక్క హుస్సైన్ తప్ప అందరూ మరణిస్తారు. 10వ రోజు శుక్రవారం నమాజు చేసుకోడానికి శత్రువు వద్ద అనుమతి తీసుకుని ప్రార్థన చేస్తూ వుండగా శత్రువు హుస్సైను చంపివేస్తారు. అది యుద్ధనీతికి వ్యతిరేకం. అలా చనిపోయిన 72 మందిని సంస్మరించుకునే రోజు మొహరం. ఆనాడు యుద్ధం పది రోజులపాటు జరిగింది కనుక దీనిని పది రోజులు చేస్తారు. ఆ రోజుల్లో నిప్పులు గుండాలు తొక్కడం, రక్తం వచ్చేటట్లు తమను తాము హింసించుకోవడం, కొరడాలతో తమను తాము కొట్టుకోవడంలాంటి దురాచారాలను ముస్లిములు పాటిస్తారు. ఆ రోజు కర్రలకు ఇత్తడి పళ్ళాలు తొడిగి ఊరేగిస్తారు. ఇవన్నీ కర్బలా యుద్ధంలో హుస్సైన్, వారి కుటుంబీకులు వాడిన ఆయుధాలకు ప్రతీకలు. ఇది షియా ముస్లిములకు సంబంధించింది. జెండా చెట్టు, దానిపై జెండాలు పెట్టడం కూడా ఒక మూఢనమ్మకమే. నెల్లూరులో ప్రతి సంవత్సరం జరిగే రొట్టెల పండుగ కూడా ఒక గుడ్డి నమ్మకమే. రొట్టెలు మార్చుకోవడం ద్వారా తమ కోర్కెలు తీరుతాయని నమ్ముతారు. దర్గాలకు వెళ్ళినట్లుగానే, ఈ రొట్టెల పండుగకు కూడా హిందువులు అత్యధికంగా హాజరవుతుంటారు.

ముస్లిములు రోజుకు ఐదుసార్లు ప్రార్థన చేయాలి. మక్కా వున్న దిక్కువైపు తిరిగి మోకాళ్లపై కూర్చుని ప్రార్థన చేస్తారు. భౌగోళికంగా మక్కా ఏ దిక్కున వుంటుందో ఆయా దేశాలవారు నిర్ణయించుకుంటారు. మనకైతే పడమరగ వుంటుంది. వీరి పండుగలలో మరో ముఖ్యమైనది బక్రీదు. ఇది వారి కేలండర్లో 12వ నెల. ఆ నెల 10వ తేదీన ఈ పండుగ చేసుకుంటారు. అల్లాహ్ పలువురు ప్రవక్తలను పంపారు. వారిలో హజరత్ ఈబ్రహీమ్ ఒకరు. అతనికి తన కొడుకు ఇస్మాయిల్‌ను అల్లాహ్‌కు బలి ఇచ్చినట్లు కల వస్తుంది. అంటే అల్లాహ్ అలా కోరుతున్నాడు అని తలచి కొడుకును బలి ఇవ్వడానికి తయారు అవుతాడు. అతని మెడ మీద కత్తి పడే సమయానికి కొడుకు బదులు ఒక పొట్టేలు వుంటుంది. ఆ పొట్టేలును నరుకుతాడు. అంటే అల్లాహ్ అతని భక్తిని పరీక్షించాడన్నమాట. కనుక బక్రీద్ రోజున పొట్టేలును చంపి దాని మాంసం తింటారు. ఈ నెలలోనే ముస్లిములు మక్కాకు హజ్ తీర్థయాత్ర చేయడం ప్రారంభిస్తారు.

వీరి మరో ముఖ్యమైన పండుగ రంజాన్. ఇది వారి కేలండరులో తొమ్మిదో నెల. బక్రీద్ తరువాత 70 రోజులకు ఈ పండుగ చేసుకుంటారు. ఈ నెల ఖురాన్ అవతరించిన నెల. 30 రోజులు ఉపవాసాలు వుండి 10వ నెల మొదటిరోజు ఖురాన్‌ను అవతరింపచేసినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియచేస్తారు. ఈ నెలలో క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన అలవడుతుంది. తమ సంపాదనలో 30 శాతం దాన ధర్మాలకు ఉపయోగించాలి.

సౌదీ అరేబియాలో వున్న మక్కాకు పుణ్యయాత్రలు చేసేవారందరూ, మక్కాకు తూర్పుగా వున్న మినా నగరంలోని మూడు స్తంభాలు (ఇప్పుడు గోడలు) పై గులకరాళ్ళను విసిరే ఒక ఆచారం కొనసాగుతూ వుంది. అబ్రహమ్ మినా నగరం వదలిన తర్వాత ఒక రాళ్ళగుట్ట దగ్గర సైతాన్ కనబడగా, గేబ్రియల్ సలహాతో దానిని రాళ్ళతో కొట్టి తరిమాడు. ఏడు రాళ్ళు విసిరిన తర్వాత సైతాన్ మాయమయ్యాడు. మరలా మరో రాళ్ళగుట్ట దగ్గర కనబడితే మరోసారి ఏడు రాళ్ళతో తరిమాడు. మూడోసారి చిన్న రాళ్ళగుట్ట దగ్గర కూడా ఏడు రాళ్ళతో సైతాను తరిమాడు. సైతాన్‌ను తరిమివేయడానికి ప్రతీకగా యాత్రికులు ప్రతి స్తంభం మీదా ఏడు గులకరాళ్ళు విసురుతారు. జనం త్రొక్కిసలాటలో కుంభమేళాలో, పుష్కరాలలో జరిగినట్లు ఇక్కడా యాత్రికులు మరణిస్తుంటారు. 2006లో 346 మంది మరణించగా, 289 మంది గాయపడ్డారు. 2015 సెప్టెంబరు 24న 2431 మంది చనిపోయారు. 427 మంది ఆచూకీ తెలియలేదు.

ముస్లిములలో అభ్యుదయవాదులు ఈ మతం పాటించేవారిలో ప్రవేశించిన అనేక మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసినవారున్నారు.

---

అగ్రకులాల్లో ఒక బలవంతుల వర్గం వాళ్ళ 'ప్రతిభ' వల్ల ఏర్పడలేదు. ఇతరులను దోచుకోవడానికి కావలిసిన ఆస్తి ఉంది. రాజకీయాధికారం ఉంది. ఇతరులకు కాకుండా చేసి తామే సొంతం చేసుకున్న నాగిరకత ఉంది. కులవ్యవస్థ వీటిని సమకూర్చి పెట్టింది. వీటిని నిలుపుకోవడం కోసం, పెంపుదల చేసుకోవడం కోసం కులాన్ని నిరభ్యంతరంగా వాడుకుంటూనే ఉంటారు. **– కె. బాలగోపాల్**

---



**ది.14.9.2026న విజయవాడలో నాస్తిక సమాజం సభ్యులు వి. ఫణీంద్రకుమార్ గృహములో జరిగిన నాస్తిక సమాజం సభ్యుల సమావేశం దృశ్యము**

# బైబిల్ బాగోతం

(గత సంచిక తరువాయి)

– డా॥ కోనా వీరబ్రహ్మం

**42. మరణమంటే అపవిత్రాత్మ మనుష్యుని వదలిపోవటమేనా? ఐతే అది మంచిదే కదా? ఈ మాటల్ని నమ్ముతున్న వాళ్ళనందర్నీ చచ్చిపొమ్మని చెప్పొచ్చు కదా?**

మత్తయి 12:43–45 ప్రకారం ఖాళీయైన ఇంటిని (మృతదేహాన్ని) విడచిపెట్టిన ఒక దయ్యం ఆ ఇల్లు మళ్ళీ ఊడ్చి అమర్చి ఉండటం చూచి, తనకంటే చెడ్డవైన మరి ఏడు దయ్యాలను వెంటబెట్టుకొని వస్తుందట కాపురముండటానికి. దీన్నిబట్టి మనకేమి సందేహాలొస్తాయంటే, మరణమంటే అపవిత్రాత్మ (దయ్యం) మనుష్యుని వదలిపోవటమేనా? ఐతే, అది మంచిదే కదా! ఈ మాటల్ని నమ్ముతున్న వాళ్ళనందర్నీ చచ్చి పొమ్మనండి! అలా చేస్తే వారిలో ఉన్న అపవిత్రాత్మలు (దెయ్యాలు) వదలిపోతాయిగదా!

ఖాళీయైన ఇంటిని మళ్ళీ ఊడ్చి అమర్చి మరి యేడు చెడ్డ దయ్యాల కోసం సిద్ధం చేయడం దేనికి? ఇదేం పాడుపని? ఇది దేవుడు చెయ్యాల్సిన పనేనా?

**43. యేసు పక్షపాతి!**

పరలోక రాజ్యపు మర్మములె ఎరుగుటకు శిష్యులకే ఎందుకు అనుగ్రహింప బడింది? భక్తులందరికీ అనుగ్రహించ వచ్చుగా? అందరూ బాగుపడడం ఆయనకు ఇష్టం లేదా?

మత్తయి 13:11 లో ఇలా ఉంది. "పరలోక రాజ్య మర్మములు ఎరుగుటకు మీకు (శిష్యులకు) అనుగ్రహింపబడియున్నది గాని వారికి (మిగిలిన భక్తులందరకూ) అనుగ్రహింప బడలేదు".

**44. యేసు పేదల పెన్నిధి కాదు, ధనవంతుల తాబేదారు!**

మత్తయి 13:12లో ఇలా ఉంది. "కలిగిన వానికే యియ్యబడును, వానికి సమృద్ధి కలుగును. లేనివానికి కలిగినదియు వానియొద్దనుండి తీసివేయబడును".

మత్తయి 25:29లో ఇలా ఉంది. "కలిగిన ప్రతివానికి ఇవ్వబడును. అతనికి సమృద్ధి కలుగును. లేనివాని యొద్దనుండి వానికి కలిగినదియు తీసివేయబడును''. ఇంకా ఇందుకు సాక్ష్యం లూకా 8:18లోను, లూకా 19:26లోను ఉంది.

**45. ఆవచెట్టు మీద ఆకాశపక్షులు నివసించును!**

"అది (ఆవగింజ) విత్తనములన్నింటిలో చిన్నదేకాని పెరిగినప్పుడు కూరమొక్కలన్నిటిలో పెద్దదై ఆకాశపక్షులు వచ్చి దాని కొమ్మలయందు నివసించునంత చెట్టగును". మత్తయి 13: 32 ఆవచెట్టు కొమ్మలమీద ఆకాశపక్షులు నివసిస్తాయట! మీకు తెలుసా?

**46. నమ్మితే మహిమ, నమ్మకపోతే మాయ (హంబక్)!**

సత్యసాయిబాబా హేతువాదుల దగ్గర టక్కుటమారాలు ఎలా చేయలేడో, అలాగే యేసు తన చుట్టూ అవిశ్వాసులుంటే అద్భుతాలు చేయలేడు. నిజంగా అద్భుతాలు చేయగల మనుష్య కుమారుడికైనా, దేవుని కుమారుడికైనా అవిశ్వాసులతో అడ్డేమిటంట? మత్తయి 14:58లో ఇలా ఉంది. "వారి అవిశ్వాసమును బట్టి ఆయన అక్కడ అనేకమైన అద్భుతములు చేయలేదు".

**47. యేసు వచ్చింది ఇశ్రాయేలీయుల కొరకే గాని, ఇతరుల కొరకు కాదు!**

"కనాను స్త్రీ యొకతి వచ్చి" తన కుమార్తెకు పట్టిన దయ్యాన్ని పోగొట్టమని యేసును వేడుకుంటుంది. "ఆయన ఇశ్రాయేలు ఇంటివారైన నశించని గొఱ్ఱెల యొద్దకే గాని మరి ఎవరి యొద్దకును నేను పంపబడలేదనెను". మత్తయి 15:24.

వాస్తవం ఇది కాగా, యేసు సర్వమానవాళికి రక్షకుడు ఎలా అవుతాడు? ఇక్కడ తెలుసుకోవలసిన అర్థాలు గొఱ్ఱెలు = మనుషులు (బైబిలు దృష్టిలో మనుషులు గొఱ్ఱెల క్రింద చూడబడ్డారు) కనాను = ఇశ్రాయేలీ కాని ఒక తెగ.

**48. ఏసు సంస్కార హీనుడు!**

ఏసుపై నమ్మకంతో తన కూతురికి పట్టిన దయ్యం పోగొట్టమని వచ్చిన అన్యజాతికి చెందిన కనాను స్త్రీతో తను చేసే సహాయం ఇశ్రాయేలీయులకే గాని అన్యులకు కాదని చెప్పటానికి "పిల్ల రొట్టె తీసుకొని కుక్కపిల్లలకు వేయుట యుక్తము కాదు" అని మత్తయి 15:26లో ఏసు దారుణంగా కించపరచాడు. ఐనప్పటికీ ఆ స్త్రీ వదలక వెంటపడుతూ "నిజమే ప్రభువా! కుక్క పిల్లలు కూడా తమ యజమానుల బల్లమీద నుండి పడుముక్కలు తినును కదా" అని తనను తాను తక్కువ చేసుకున్నాక, అటువంటి ఆమె విశ్వాసాన్ని బట్టి ఆమె కూతురికి స్వస్థత చేకూర్చాడట – భూతవైద్యుడైన యేసు!

**49. యేసును క్రీస్తు అని చెప్పగూడదు – యేసు!**

"తాను క్రీస్తు (అభిషిక్తుడు) అని యెవనితోను చెప్పవద్దని ఆయన తన శిష్యులకు ఖండితముగా ఆజ్ఞాపించెను" అని మత్తయి 16:20లో ఉంది. దీన్ని బట్టి క్రైస్తవులు "యేసు క్రీస్తు" అని యేసుని సంబోధించటం ఆయన ఆజ్ఞను అతిక్రమించటమే కాగలదు. ఇది నిజమైన భక్తులకు తగునా?

యేసును యేసుక్రీస్తు అని పిలవగూడదని మత్తయి 16:20లోనే కాక, మార్కు 8:30లోను, లూకా 9:21లోను కూడా ఉంది. చూడండి.

**50. ప్రేమ గుడ్డిదో కాదో తెలియదు గానీ, భక్తి మాత్రం పిచ్చిది!**

భక్తి విశ్వాసాలకు సాధారణ సూత్రం అనుమానాలు, అభ్యంతరాలు లేవనెత్త కూడదు. వాటిని సహించగూడదు. ఇది మతం చెప్పే కరడుగట్టిన సూత్రం. అది ఏ మతమైనా ఒక్కటే. మత్తయి 18వ అధ్యాయంలో 7, 8 వచనాలు ఇలా ఉన్నాయి. "అభ్యంతరముల వలన లోకమునకు శ్రమ. అభ్యంతరములు రాక తప్పవు గాని, యెవని వలన అభ్యంతరము వచ్చునో ఆ మనుష్యునికి శ్రమ. కాగా నీ చెయ్యి యైనను నీ పాదమైననూ నిన్ను అభ్యంతరపరచిన యెడల, దానిని నరికి నీ యొద్ద నుండి పారవేయుము".

క్రైస్తవమతంలో ఇటువంటి అసాంఘిక నియమాలు ఉన్నాయి కాబట్టే ఈనాడు క్రొత్తగా మతాన్ని స్వీకరిస్తున్న కుటుంబాల్లో చుట్టరికాలు దెబ్బతింటున్నాయి. ఆ కుటుంబాలవారు తమతోపాటు మతాంతీకరణ చెందని తమ బంధువుల్ని పరాయివారుగా భావిస్తున్నారు. తాము రక్షణ మార్గంలోకి వచ్చినట్లు, ఇతరులు పాపపంకిలంలోనో, నరకకూపంలోనో ఉన్నట్లు కూడా భావిస్తున్నారు, ప్రచారం చేస్తున్నారు.

క్రొత్తగా మతం పుచ్చుకున్నవారి మాటల్లో చెప్పాలంటే తమతోపాటు మతం మారని తమ బంధువులను వారు "అన్యజనులు" గా చూస్తున్నారు. ఇందువల్ల వారంతట వారే చుట్టాలనుండి దూరపువారుగా చూడబడుతున్నారు. అంతేకాదు, ఆ కుటుంబంలోనే యేసుని ఒప్పుకోని సభ్యులు ఉంటే, వారి మధ్య మనస్పర్ధలు చోటు చేసుకుంటున్నాయి. అలా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్న మౌతుంది.

**51. "నీ కన్ను నిన్ను అభ్యంతర పరచిన ఎడల దాన్ని పెరికి నీ యొద్దనుండి పారవేయుము". మత్తయి 18:9**

ఒక కంటికి శుక్లం (కేటరాక్ట్) వచ్చి చూపు మందగిస్తే దాన్ని పీకెయ్యాలి గాని, మరి కంటి డాక్టరు దగ్గరకెందుకు వెళ్తారు క్రైస్తవులు?

**52. బైబిలు ప్రకారం కూడా భార్యాపిల్లల్ని అమ్మి అప్పు తీర్చుకోవచ్చు!**

"అప్పు తీర్చుటకు వాని యొద్ద ఏమియులేనందున, వాని యజమానుడు వానికి (అప్పిచ్చినవానికి) వాని భార్యను, పిల్లలను, వానికి కలిగినది యావత్తును అమ్మి అప్పు తీర్చవలెనని" మత్తయి 18:25లో ఒక కథలో అన్యాపదేశంగా యేసు ఈ సందేశాన్నిచ్చాడు. భార్య, పిల్లలు మొగుడి సొత్తన్నమాట. వాడు వాళ్లని ఏమైనా చేసుకోవడానికి హక్కుదారుడు. అమ్ముకోవచ్చు, తాకట్టు పెట్టుకోవచ్చు. ఇది అన్ని మతాల ఇతిహాసాలు చెప్పేనీతి.

**53 ప్రశ్న: మొగుడు కఠినుడైతే పెళ్ళాన్ని విడువవచ్చా?**

**యేసు చెప్పిన జవాబు: కఠినుడైన మొగుడు పెళ్లాన్ని విడువవచ్చని మోషే సెలవిచ్చారు.**

మత్తయి 19:6-8లలో ఇలా ఉంది. "దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచగూడదని (యేసు) చెప్పెను. అందుకు వారు (పరిసయ్యులు) అలాగైతే పరిత్యాగపత్రికనిచ్చి ఆమెను విడనాడుమని మోషే యెందుకు ఆజ్ఞాపించెనని వారాయనను అడుగగా, ఆయన (యేసు) మీ హృదయకాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను, గాని ఆదినుండి అలాగు జరుగలేదు" అనెను.

**54. వ్యభిచారం గురించి తప్ప క్రైస్తవులు విడాకులివ్వగూడదు!**

"వ్యభిచార నిమిత్తమే తప్ప తన భార్యను విడనాడి మరియొకతెను పెండ్లి చేసుకొనువాడు వ్యభిచారము చేయుచున్నాడు". మత్తయి 19:9

**55. తల్లిదండ్రుల్ని గౌరవించాలా? తిరస్కరించాలా? ఏమని యేసు ఆజ్ఞ?**

యేసు తన తల్లిని అవమానించినట్లు మత్తయి 12:47 - 50 వచనాలలో ఉన్న సంఘటనను బట్టి తెలుస్తోంది. ఇలా ఉంది. "అప్పుడొకడు - ఇదిగో నీ తల్లియు నీ సహోదరులును నీతో మాటలాడవలెనని వెలుపల నిలిచి యున్నారని ఆయన (యేసు)తో చెప్పెను. అందుకాయన తనతో ఈ సంగతి చెప్పిన వానిని చూచి - నా తల్లి యెవరు? నా సహోదరులు ఎవరు? అని చెప్పి తన శిష్యులవైపు చెయ్యి చాపి - ఇదిగో నా తల్లియు, నా సహోదరులును, పరలోకమందున్న నా తండ్రి చిత్తము చొప్పున చేయువాడే నా సహోదరుడును, నా సహోదరియు, నా తల్లియు" అని చెప్పి తనను చూడవచ్చిన తన తల్లిని, తమ్ముళ్ళను తిరస్కరించి మెహర్బానీ కోసం తన భక్తకోటిలో వారిని కించపరచాడు. వారు చేసేది లేక ఖిన్నులై మరలిపోయారు. (ఇంకా వుంది)

# జీవుల పుట్టుక - మానవ పరిణామం

*భౌతికవాదం ప్రకారం...పదార్థమే ప్రపంచానికి మూలం. ఈ విశ్వానికి...ప్రపంచాతీతమైన బాహ్యశక్తి ఏదీలేదు.*

**- జి. కమలారామ్**

ప్రపంచానికంతా మూలమైన ఈ పదార్థం 92 మూల పదార్థాలతో కూడి ఉన్నది. పదార్థం... అనేక సూక్ష్మ పరమాణువుల కలయికే అని "జాన్‌డాల్డన్" అనే లండన్ శాస్త్రవేత్త తెలిపారు. ప్రతి పరమాణువులోనూ విద్యుత్ రూపంలో ఎలక్ట్రాన్స్, ప్రొటాన్స్, న్యూట్రాన్స్, మెసాన్సు అనే మూలకాలు ఉన్నాయి. పరమాణువులతో కూడిన ఈ పదార్థం నిత్యం చలనంలోనే ఉంటుంది. పదార్థ పరిణామాభివృద్ధే.. ప్రకృతి పరిణామాభివృద్ధి.

ఈ పదార్థ పరిణామక్రమంలో మొదటిగా ప్రొటెస్టా అనే తొలి జీవకణం ఏర్పడి పరిణితి చెందుతూ ఎన్నో దశలలో జీవులు ఏర్పడ్డాయి. అలా ఏర్పడిన జీవులలో... పరిసరాల వాతావరణానికి అనుకూలంగా ఉన్న ప్రాణులు మాత్రమే బ్రతికి క్రమక్రమంగా వృద్ధిచెందాయని, మిగిలినవి క్షీణించి పోయాయని "డార్విన్" శాస్త్రవేత్త తెలిపారు.

శాశ్వత సహజలక్షణమైన పదార్థ చలనం అనంతమైనది. జీవకణం నుండి మానవునివరకూ, ప్రతిదీ ప్రకృతిలో ఉద్భవిస్తూ, నిరంతరం చలనంలో.. మార్పులలో వుంటుందని "ఏంగెల్స్" అనే శాస్త్రవేత్త తెలిపారు. పరమాణువులతో కూడిన ఈ అణువులు వేగంగా సంచరించడం వలన వస్తువులకు గతిజ శక్తి కల్గుతుంది. అనేక పరమాణువులతో కూడిన ఈ పదార్థం నిరంతరం చలిస్తూ వలయాకారంలో తిరుగుతూ వుండటంతో నక్షత్రాలు, సూర్యమండలం ఏర్పడ్డాయి.

ఇలా ఈ పదార్థం గురుత్వాకర్షణశక్తి కలిగి అనేక చిన్న మండలాలను ఆకర్షిస్తుంది. మండలాల మధ్య వున్న ప్రదేశం వాతావరణంతో కూడి ఉన్నది. మండలాల భ్రమణాల వలన తరంగాలూ.. ధ్వని... గాలి ఏర్పడి, అనేక ఏళ్ళ తరువాత తారామండలం, సూర్య మండలం ఏర్పడ్డాయి. తారామండలంలో 180 కోట్ల నక్షత్రాలున్నాయి. సూర్యమండలం మండుతున్న అగ్నిగోళం. సూర్యగోళం వ్యాసం 8 లక్షల 64 వేల మైళ్ళు.

అతి పెద్ద గ్రహమైన సూర్యమండలంలోని సూర్యుడిని ఆశ్రయించి అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని గ్రహాలున్నాయి.

కోట్ల సంవత్సరాల తర్వాత సూర్యుడి నుండి విడిపోయిన కొంతప్రదేశం భూమిగా ఏర్పడి గురుత్వార్షణశక్తి కలిగి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగసాగింది. తన చుట్టూ తాను తిరుగుటకు 24 గంటలు, సూర్యుని చుట్టూ తిరుగుటకు 365 రోజుల కాలం పడుతుంది.

భూమి వైశాల్యం 19 కోట్ల 70 లక్షల చదరపు మైళ్ళు. బరువు సుమారు 5,800 బిలియన్ టన్నులు.

పదార్థ పరిణామగతి వలన భూమికి ఈ స్వభావం వచ్చింది.

భూ మండలానికి దగ్గరగా వున్న నక్షత్రం పేరు "ప్రాక్జిమా"

సూర్యుడి నుండి విడిపోయిన భూమి తొలి దశలో విపరీతమైన ఉష్ణ వాతావరణం కల్గి ఉండటంతో.. మొక్కలూ, ప్రాణులూ ఏర్పడలేదు. అలాగే భూమి నుండి విడిపోయిన కొంత పదార్థం... భూమికి 2 లక్షల 38 వేల మైళ్ళు దూరంలో చంద్రగ్రహంగా ఏర్పడింది.

కొన్ని వేల సంవత్సరాల తర్వాత భూమిపై వాతావరణ మార్పులు కలిగి, ఏళ్ళ తరబడి కుంభవృష్టిగా వర్షం కురిసి భూమి ఉష్ణోగ్రత తగ్గిన పిదప, గుట్టలు, కొండలు, నదులూ, సముద్రాలు ఏర్పడ్డాయి. తిరిగి వేల సంవత్సరాల తర్వాత నాచు, పొదలూ, మొక్కలు, చెట్లు మొలిచాయి. నాచు ఆధారంగా తొలి ఏక కణ జీవులు (ప్రొటోజోవా) ఏర్పడి, నీటి ద్వారా అనేక జలచరాలూ పుట్టి... కొన్ని నేల పైకి వచ్చి భూచరాలుగా మారాయి.

ఈ జీవులలో కొన్ని గుడ్లను పెట్టేవి, కొన్ని పిల్లలను కనేవి. తరువాత కాలంలో చేపలూ, కప్పలూ, పాములూ, నత్తలూ, క్రిములూ, కీటకాలూ, రకరకాల పక్షులూ, కుందేళ్ళూ, జింకలూ, ఎలుగుబంట్లు, మొసళ్ళూ, నక్కలూ, జిరాఫీలు, ఏనుగులు, కుక్కలూ, ఎన్నో రకాల చిన్న, పెద్ద జంతువులూ ఏర్పడ్డాయి. వీటిలో కొన్ని శాఖాహారులు, కొన్ని మాంసాహారులు.

వీటి తర్వాత కాలంలో అనేక దశాబ్దాల తర్వాత ఒక రకం జాతి కోతులు ఏర్పడ్డాయి. ఇవి దట్టమైన బొచ్చు కలిగి, కాళ్ళు చేతులతో చెట్టు ఎక్కి దిగుతూ పండ్లు కాయలు తింటూ బతికేవి. ఇవి కూడా అనేక మార్పులు చెందుతూ ఎన్నో ఏళ్ళ తర్వాత వీటి నుండి చింపాంజీ, గొరిల్లా, ఉరంగ్ జాతి కోతులు ఏర్పడ్డాయి. వీటిల్లో చింపాంజీ జాతి తెలివైనవి, చురుకైనవి.

డార్విన్ చెప్పిన ప్రకారం.. ప్రాణులు అక్కడి పరిసరాలకు, వాతావరణానికి అనుకూలంగా తమ శరీర అవయవాలను పెంపొందించుకుంటూ, తమ సహజ లక్షణాలను తన సంతతికి సంక్రమింప చేసుకుంటాయి.

అలాగే చింపాంజీ జాతులు నేలమీద కాళ్ళతో నడుస్తూ చేతులతో పండ్లు, కాయలూ కోసుకొని తింటుండేవి. వీటి చేతుల ఎముకలు చెట్లు, రాళ్ళు, కర్రలు పట్టుకోవడానికి అనుకూలంగా ఉండేవి. ఆ తరువాత చింపాంజీ నుండి వచ్చిన సంతతిలో ఇంకా అనేక మార్పులు వచ్చాయి. మనిషిలాగ నిటారుగా నిలబడటం, దట్టమైన బొచ్చురాలి పోవడం, తోక తగ్గడం, పూర్తిగా కాళ్ళతోనే నడవడం, అలాగే క్రూరజంతువులకు దూరంగా జీవించడం నేర్చుకొని మనిషిలా ప్రవర్తిస్తున్న వీరిని "పితకాంత్రోపస్ మనిషి" అనేవారు.

తరువాత తరాలలో ఇంకొంచెం అభివృద్ధికలిగి, ఇంకా మార్పులు చెంది మానవ లక్షణాలు పెరుగుతూ వచ్చాయి. మృగాలను ఎదుర్కోడానికి గుంపులుగా కలిసి వెళ్తూ, స్వతంత్ర్యంగా జీవనం సాగిస్తున్న ఈ మానవుడు "సైనాంత్రోపస్ మనిషి"గా మారాడు. తరువాత కాలంలో రాళ్ళతో గునపాలు, రాళ్ళ కత్తులు, కర్రలతో ఈటెలు తయారు చేసుకొని భూమిని తవ్వి.. మొక్కలూ, చెట్లు నాటుకొని పండ్లు కాయలూ పండించుకొనేవారు, ఇవి లేనపుడు చిన్నచిన్న జంతువులను కర్రలతో ఈటెలతో వేటాడి చంపి మాంసాహారం తినేవారు.

కాలక్రమేణా వచ్చిన మార్పులతో... వందల సంవత్సరాల తరువాత ఇంకొంచెం ఎక్కువ శారీరక మార్పులు, ఎక్కువ మనిషి లక్షణాలు కల్గిన నూతన మానవుడు "హెడల్ బర్గ్ మనిషి"గా ఎదిగాడు. వీరంతా ఒకటిగా సంఘజీవులుగా ఏర్పడి, స్త్రీ పురుషులందరూ కలిసిమెలిసి గుహలలో జీవించేవారు.

రాళ్ళ రాపిడితో నిప్పును పుట్టించుకొని, చెట్ల కర్రముక్కలతో మంటలేసుకొని క్రూరమృగాలను రానీకుండా కాపలా కాసేవారు. వేటాడి చంపిన చిన్న జంతువులను నిప్పులలో కాల్చుకొని తినే వారు. మిగిలిపోయిన జంతుచర్మాలను శుభ్రపరుచుకొని చలికి కప్పుకునేవారు.

మాటలు తప్ప అన్ని మనిషి లక్షణాలు కలిగిన వీళ్ళు రాతితో వస్తువులను తయారుచేసుకొని వ్యవసాయ పనిముట్లను ఉపయోగించుకుంటూ స్వతంత్రంగా బ్రతుకుతున్న ఈ మానవులను "రాతియుగం మనుషులు" అనేవారు. మాట్లాడటానికి నోటి నిర్మాణము సరిగాలేక దవడలు, పెద్దపళ్ళు, మందపు నాలుక అనుకూలంగా వుండేవికావు. అందువలన వారు కేకలతో అరుస్తూ, చేతులతో సైగలు చేసుకుంటూ మూగభాషతో ఇతరులకు తమ భావాలను తెలిపేవారు.

మృగదశ నుండి విడిపోయిన మానవుడు వేలసంవత్సరాలలో ప్రకృతిని వశపర్చుకొని అనేక మార్పులతో, అనేక కొత్త అలవాట్లను నేర్చుకుంటూ, పనులకు ప్రాముఖ్యతనిస్తూ.. స్త్రీ పురుషులంతా కలిసిమెలిసివుంటూ సంతానాభివృద్ధి పరుచుకుంటూ జీవించేవారు. ప్రకృతి పరిణామంలో కాలానుగుణమైన మార్పులు కలిగి నోటి నిర్మాణంలో కూడా వైవిధ్యం ఏర్పడి, దవడలు పెరిగి, పళ్ళు చిన్నవిగా మారి, నాలుక మందం తగ్గి పలుచబడి, మాటలు ఉచ్చారణకు అవసరమైన అంగాల ఏర్పాటులో అభివృద్ధి జరిగింది. దీనితో చిన్న చిన్న మాటలతో, చేతుల సైగలతో, తోటివారితో జీవనం సాగించేవారు.

కాలక్రమేణా పంచేంద్రియాలు, మెదడు అభివృద్ధిచెంది ఆలోచనలు పెరిగి జీవనవిధానాన్ని పెంపొందించుకుంటూ, ఇంకొంచెం వ్యవసాయ పనిముట్లను తయారుచేసుకొని, మొక్కలు, చెట్లూ, ధాన్యపు పంటలూ పండ్లు పండించుకుంటూ, ఇంకా మంచి ఆహారపు అలవాట్లతో తెలివితేటలు పెంచుకొని, శారీరకంగానూ మానసికంగానూ ఎంతో అభివృద్ధిచెంది, ఎక్కువ శక్తిమంతుడై "సంపూర్ణ మానవుడి"గా ఎదిగాడు. ఆ తరువాత పశువులను, గొర్రెలను, మేకలను, గేదెలను, ఆవులను మచ్చిక చేసుకొని, పాడిపంటలను వృద్ధిచేసుకున్నాడు.

ప్రత్యేక జీవనవిధానాన్ని అలవరచుకుని ప్రకృతిని మానవుడు వశపరుచుకున్నాడు. పూర్తి మానవుడుగా మారడానికి ప్రాతిపదిక వేసుకోగలిగినాడు.

పాదార్థిక, గతితార్కిక, చైతన్యమే జీవుల ఆవిర్భావానికి కారణం. అంతేతప్ప ఒక్క రోజులోనో, ఒక నెలలోనో అభివృద్ధి కాదు, ఏదో మంత్రశక్తితోనో మహిమలతోనో భూమి, మానవుడు ఏర్పడలేదు. ఇది కోట్ల సంవత్సరాల పరిమాణ క్రమంలో జరిగింది.

అయితే ఈ సిద్ధాంతాలను కొందరు బూర్జువా సైంటిస్టులు విమర్శించారు, వ్యతిరేకించారు. కానీ సోవియట్ రష్యా శాస్త్రవేత్తలు వాటిని ఖండించి, డార్విన్, డాల్టన్, ఎంగెల్స్ యొక్క పరిశోధనలే వాస్తవానికి దగ్గరైనవి అని తేల్చారు.

జంతువుకు మనిషికీ ముఖ్యమైన తేడా ఆలోచనా విధానం, మాట్లాడే విధానం. ఈ విధంగా మన పూర్వీకుడు బ్రతకడానికి గావించిన శ్రమ, కృషి, జీవన పోరాట ఫలితంగానే సంపూర్ణ మానవుడు ఆవిర్భవించాడు. •

కదలండి! కదిలించండి!! కదలిరండి!!!

**2027 ఫిబ్రవరి 13, 14 తేదీలలో గుంటూరు జిల్లా, మంగళగిరి సమీపములోని చార్వాకాశ్రమంలో జరిగే**

# 35వ జాతీయ నాస్తికమేళాకు

**మీమీ కుటుంబాలలో తరలిరండి!**

# చర్చ: వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియోపతి

(గత సంచిక తరువాయి) **- మంజీర**

"హా ! హా ! హా ! క్వాడ్రిలియన్తుయా ! (గ్రైనులో 1 తర్వాత 24 సున్నాలు చేర్చిన ఎంత అంకె అవుతుందో అన్నో వంతు) దానిలో మందేమీ లేదు. అది ఏమీ లేకపోవడంతో సమానం అని అనేక వేల సం॥ల నుండి వున్న దురభిమానం అనే బావిలో నుండి నీచమగు, మూర్ఖత్వంగల కప్పవలె అరవడం వింటున్నట్లు నాకు అనిపిస్తున్నది."

"అది ఎలా సంభవిస్తున్నది? ఒక పదార్థాన్ని విభజిస్తూ, ఆ విభజన ఎంతదూరం పోయినా, పదార్థంలోని భాగాలు తప్ప అన్యమైనది ఆ విభాగాలలో ఎలా వుండగలదు? ఇంచుమించు శూన్యానికి చేరేవరకు ఈ భాగాలను పరిమాణంలో తగ్గించినా, ఆ తగ్గించిన దానిలో ఇంకను కొంత పదార్థము అసలు దానిలో ఒక భాగం, అది ఎంత సూక్ష్మంగా నున్నప్పటికీ వుండడం లేదా? జ్ఞానం గల ఏ మానవుడు దీనిని కాదనగలడు?"

"ఈ సూక్ష్మభాగం విభజించబడిన పదార్థంలో 'నిజమైన' అంతర్భాగంగా ఇంకా వున్నట్లు అయితే, (స్పృహలో వున్న ఏ మానవుడు దీనిని కాదనగలడు) అసలు పదార్థం చాలా అద్భుత శక్తి వంతమైనదని తలంచేటప్పుడు, ఈ సూక్ష్మపదార్థం కూడా నిజానికి కొంత పదార్థమని చూస్తున్నప్పుడు, ఈ సూక్ష్మపదార్థం ఎందుకు పనిచేయలేదు? ఈ సూక్ష్మ పదార్థం ఏం చేయ గలదు, ఎంత చేయగలదు అన్నది అంచనాపై ఆధారపడిగాని, హేతువాదాన్ని బట్టిగాని, నిర్హేతువాదాన్ని బట్టిగాని నిర్ణయించలేము. అనుభవం (ఆచరణ) ను బట్టి మాత్రమే నిర్ణయించగలం, యదార్థ విషయాలను కనుగొనడానికి ఆచరణను మించినది లేదు. ఈ చిన్న భాగం సారూప్యమైన వ్యాధిని తొలగించలేనంత బలహీనపడిందా, రోగికి ఆరోగ్యాన్ని కలిగించగలదా అన్నది నిర్ణయించేది అనుభవం (ఆచరణ) మాత్రమే. విద్యార్థివలె సిద్ధాంత సంబంధమగు గ్రంథపఠనం వల్ల ఈ విషయం నిర్ణయించబడదు. (ఆచరణ) అనుభవం వల్ల మాత్రమే నిర్ణయించబడుతుంది. ఇటువంటి విషయాలలో (ఆచరణ) అనుభవం మాత్రమే తగిన న్యాయాధిపతి."

"పదార్థాన్ని నిర్జీవరాశిగా అజ్ఞానులు మాత్రమే ఇప్పటికీ భావిస్తున్నారు. పదార్థ అంతర్భాగం నుండి నమ్మటకు వీలులేని, ఆశ్చర్యమగునట్టి శక్తులు పైకి తేబడగలవు."

"హోమియోపతి పద్ధతిలో ఉపయోగించుటకు మందులను పొటెన్సీలుగా మార్చు పద్ధతి వల్ల, ఔషధ లక్షణములు లేని ద్రవం యొక్క అధిక నిష్పత్తిలోనున్న పరిమాణమందంతట ఔషధపు చుక్క సమానంగా పంచిబెట్టబడడమే కాక, ఔషధముల డైనమిక్ (అగోచర) శక్తి వృద్ధి చెందుట అనే గొప్ప మార్పు ఆశ్చర్యకరమయ్యేటంత (నమ్మటకు వీలు లేనంత) అధికంగానూ, ఊహించుటకు వీలులేనంత నివారణాత్మకంగాను సంభవిస్తున్నది."

పోటెంటైజేషన్ ప్రక్రియ డా॥ హానిమన్ అద్భుత మేధాశక్తికి నిదర్శనం. అందుకనే ఈ విషయాన్ని ఆయన మాటల్లోనే వివరించడం జరిగింది. పై వాక్యాలన్నీ డా॥ హానిమన్ 1813కు

ముందు చెప్పినవి. ఆనాటికి పదార్థ విజ్ఞానశాస్త్రం, తత్వశాస్త్రం అభివృద్ధి అయిన స్థాయి, తరువాత నిరూపించబడిన విషయాలతో, ముఖ్యంగా ఐన్‌స్టీన్ కనుగొన్న విషయాలతో పోల్చి చూస్తే డా॥ హానిమన్ ప్రజ్ఞా పాటవం మనకు అర్థమవుతుంది. పొటెంటైజేషన్ ప్రక్రియలో 6వ పొటెన్సీ తరువాత రసాయనిక పరీక్షలో అసలు మందు కనపడదు. కాని ఇప్పుడు కనుగొన బడిన ఆటమిక్ టెస్ట్ పరికరాల ద్వారా పొటెన్సీలలో అసలు మందు వున్న విషయం నిరూపించవచ్చు కూడా. హోమియోపతిలోని సెపియా, సైలీషియా, లైకోపోడియం, లెకెసిస్ మందులను పొటెంటైజేషన్ ప్రక్రియ గొప్పతనానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. సెపియా కటిల్ చేపలోని సిరా వంటి పదార్థం. సైలీషియా చెకుముకి రాయి. లెకెసిస్ అనేది ప్రమాదకరమైన పాము విషం. ఈ విషం రక్తాన్ని విరిచి క్షణాలలో మనిషిని చంపుతుంది. ఇక లైకోపోడియం ఒక మూలిక. ఈ మందుల ఔషధ ధర్మాలు 12వ పొటెన్సీ తర్వాత గాని కనిపించవు. వీటిని నిరూపించడమే పొటెన్సీలలో నిరూపించవలసి వుంటుంది. ఈ నాలుగు అనేక వ్యాధులకు ఉపయోగపడే (పాలీక్రెస్ట్) అద్భుత ఔషధాలు. ఇటువంటివే మరో రెండు – ఆర్సెనిక్ విషం, ఉప్పు (నేట్రంమూర్). పదార్థ ధర్మాలు శక్తిరూపంగా మలచిన స్థాయిలో కూడా కనిపిస్తాయనడానికి ఈ మందులే సాక్ష్యం. డా॥ హానిమన్ కనిపెట్టిన పోటెంటైజేషన్ ప్రక్రియ ద్వారా, ఈ పదార్థాలలో గుప్తంగా వున్న శక్తిని విడుదల చేసే అద్భుతమైన మందులుగా మలచగలిగారు.

పొటెంటైజేషన్ ప్రక్రియ హోమియోపతి వైద్యాన్ని మరింత అద్భుతమైనదిగా మార్చింది. వ్యాధి విచారణ సరళం, సురక్షితం, సత్వరం, సున్నితం, శాశ్వతంగా జరగాలన్న హోమియోపతి ఆదర్శాన్ని మరింత సుసంపన్నం చేసింది. అల్లోపతి మందులను కుప్పలకొద్దీ బటానీలలా బుక్కడానికి అలవాటుపడినవారు, ఈ ఆవాల వంటి 5, 6 చక్కెర గుళికెలు పనిచేస్తాయా అని అనుమానపడడంలో ఆశ్చర్యం లేదు కాని, కొందరు మార్క్సిస్టులు కూడా “ఇది మార్క్సిజం కాదు” అని గొంతు చించుకోవడం తరచుగా జరుగుతుంటుంది. మార్క్సిస్టులలో కొందరు మార్క్సిజంలో తమకు తెలియందేమీ లేదని భావిస్తే, మరికొందరు తమకు తెలిసిందే మార్క్సిజం అనుకుంటారు. ఈ భావనకు గురైనవారు గతితార్కిక భౌతికవాద సూత్రాలు ప్రకృతిలో ఎన్ని విధాలుగా పనిచేస్తున్నాయో తెలుసుకోవడంలోగానీ, తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవడంలో గాని ఎలాగూ ఆసక్తి కనబరచరు. కనీసం “పరిశోధన లేకుండా మాట్లాడే హక్కులేదు” అనే మావో సూక్తిని కూడా గౌరవించరు.

“మీరు ఒక సమస్య లోతుల్లోకి, దాని ప్రస్తుత వాస్తవాలు, దాని గత చరిత్రలోకి వెళ్ళి వాటిని పరిశోధించకపోతే, దానికి సంబంధించిన ప్రధానాంశాల గురించి మీకు ఏమీ తెలియకపోతే, మీరు దాని పైన మాట్లాడేదంతా, నిస్సందేహంగానే, అర్థంపర్థంలేని వాగుడే అవుతుంది. అర్థంపర్థం లేకుండా మాట్లాడడం వల్ల ఏ సమస్య పరిష్కృత మవదు. ఇది అందరికీ తెలిసిన విషయమే.... కామ్రేడ్లు చాలామందే ఎప్పుడూ కళ్ళను మూసే వుంచుకుంటారు. అర్థంపర్థం లేకుండా మాట్లాడతారు, ఇలా చేయడం ఒక కమ్యూనిస్టుకు చాలా సిగ్గుచేటైన విషయం” – కా॥ మావో

ఇలాంటి అనేకమంది కోసం, డా॥ హానిమన్ 1817లో "నన్ను విమర్శించువారు పరిశీలించవలసిన విషయాలు" అనే వ్యాసంలో చెప్పిన మాటలు చూద్దాం.

"ఆచరణలో హోమియో విధానం సరియైనది కాదని నిరూపించడానికి బదులు, పదాలను తప్పుగా ప్రయోగించుట, పెడార్థము తీయుట, పాండిత్యం ప్రదర్శిస్తున్నారనుకొని అర్థంలేని వాగుడు వాగుట, తిట్లు, యధార్థాన్ని నమ్మజాలనట్లు తలను అడ్డంగా ఊపుట అనేవి హోమియోపతి వంటి సత్యానికి వ్యతిరేకంగా ఉపయోగించుటకు ఏమాత్రం పనికిరాని ఆయుధాలుగా నాకు కనిపిస్తున్నాయి."

"ఇటువంటి కుయుక్తుల వల్ల హోమియోపతి వైద్య విధానం ఎగిరిపోజాలదు. కాని ఈ కుయుక్తులు పన్నిన వారిపైనే అది పనిచేయడం వాటి స్వభావం. నాకు వ్యతిరేకమైన దృక్పథంగల గౌరవనీయులైన సోదరులారా! కేవలం ఊహమీదనే ఆధారపడిన మీ వైద్య విధానాన్ని ఊపిరాడకుండ చేసి చంపివేసి, మీ వైద్య విధానమనే తుక్కునంతటిని నాశనం చేస్తుందేమోననే భయం హోమియోపతి సిద్ధాంతం వల్ల మీకు వున్నది. హోమియోపతి విధానాన్ని ఎలా తోసివేయవచ్చో, మీకు తెలిసిన దానికన్నా మంచి సలహానే మీకివ్వగలను."

"పరిశోధన మళ్ళీ మళ్ళీ చేయండి. వాటిని జాగ్రత్తగా సరిగా చేయండి, ప్రతి అడుగులో సిద్ధాంతం ధృవపడడం మీరు కనుక్కొంటారు". "దానివల్ల నివారణ కలుగకపోతే, త్వరితమైన, మృదువైన, శాశ్వతమైన నివారణ కలుగక పోతే, హోమియోపతి విధాన సూత్రాలను సరిగా అనుసరించి చేయబడిన చికిత్స చరిత్రను ప్రచురించి, పురాతన అంధకారాన్ని ఇంత తీవ్రంగా భయపెడ్తున్న ఈ సిద్ధాంతం తప్పైనదని ప్రపంచానికి మీరు వెల్లడించగలుగుతారు."

"హోమియోపతి వైద్య విధానం ప్రజ్ఞావంతమైనదని దానంతటదియే కాకపోతే హోమియో పతి వైద్య విధానమంతా పటాపంచ లైనట్లే."

డా॥ హానిమన్ జీవితమంతా సిద్ధాంత పరమైన శతృవులతోనేకాక, అల్లోపతి దుకాణం, కంపెనీ యజమానులతో కూడా పోరాడవలసి వచ్చింది. అందుకే డా॥ హానిమన్ 1810లో ప్రచురించిన హోమియోపతి వైద్యసార గ్రంథం "ది ఆర్గనాన్ ఆఫ్ మెడిసిన్" టైటిల్ పేజీలో రోమన్ కవి హోరేస్ సూక్తి Dare to be wise (విజ్ఞతతో నుండడానికి వెరువకు)" ని వుంచాడు. ఈ పోరాటం వల్లనే ఈనాడు హోమియోపతి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి నిలచివుంది, డా॥ హానిమన్ కోరుకొన్నట్లుగా, ఆయన సమాధిపై స్మారక ఫలకం మీద రాయబడిన "నా జీవితం వ్యర్థం కాలేదు" అనే వాక్యాలు, మానవాళి మహత్తర సేవకులలో ఒకనిగా డా॥హానిమన్ ఎప్పటికీ నిలిచి వుంటాడని చాటి చెపుతాయి.

**వ్యాధుల నివారణ** : హోమియోపతి లక్ష్యం వ్యాధుల శాశ్వత నిర్మూలనే తప్ప, ఉపశమనం కాదు, "ఆరోగ్య పునరుద్ధరణ సత్వరంగా, సరళంగా, శాశ్వతంగా జరగాలి. వ్యాధి మొత్తంగా నిర్మూలన కావాలి. ఇదే వ్యాధి నివారణ ధ్యేయం. అయితే ఇదంతా సుస్పష్టమైన, సులభగ్రాహ్యమైన సూత్రాను గుణంగా సాగాలి. వ్యాధి నివారణ వీలైనంత త్వరగా, విశ్వసనీయంగా, రోగికి సురక్షితంగా జరగాలి." – సూత్రం 2, 'ఆర్గనాన్, డా॥ హానిమన్. (ఇంకావుంది)

# 'జెన్ ఆల్ఫా' ధిక్కార స్వరం

– షేక్. కరిముల్లా

"నవతరమా... యువతరమా.. అదను ఇదే కదిలి రమ్ము, నీ రక్తం పుష్పించగా ఈ దేశం ఫలించాలి" అన్నారు శ్రీశ్రీ. యువతరం ధ్వజమెత్తితే... నవతరం గళం విప్పితే... నిశ్శబ్దం బద్దలై... జాతి గుండెల్లో కొత్త ఆశలు నిండుకుంటాయి. ఆవేశం నినాదమై 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ మారుమోగుతుంది. జెన్ జడ్ మొదలుపెట్టిన సమరనాదం ఇప్పుడు వెల్లువై 'జెన్ ఆల్ఫా (2010 తర్వాత పుట్టిన పిల్లలను జన్ ఆల్ఫా అంటారు)కు పాకి, ఉప్పొంగుతుంది. బీహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 70వ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, వాటిని రద్దు చేయాలని విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బీహార్ రాజధాని పాట్నాలోని ముఖ్యమంత్రి నివాసం వైపు ప్రదర్శనగా కదిలి వెళ్లారు. అయితే ఒక గొప్ప దృశ్యం అక్కడ అందరిని ఆకర్షించింది. "పోరాడితే పోయేది ఏమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప" అన్న మార్క్స్ మహాశయుని మాటలు నిజం చేస్తూ, ఒక ఆరు సంవత్సరాల ఆదిత్యకుమార్ అనే బుడతడు జాతీయ జెండా ప్రదర్శిస్తూ, 'పి.ఎం. రిజైన్' అనే పోస్టర్ పట్టుకొని ఈ ఆందోళనలో ఈ బాలుడు స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు.

ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆ బాలుడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయి, అందరిని అబ్బురపరుస్తున్నాయి. ఈ ఆందోళనలో ఆరేళ్ల బాలుడు ఆదిత్యకుమార్ దేశంలో అందరి దృష్టిని ఆకట్టుకున్నాడు. పోలీసులు ఆ బాలుడిని, అతని తల్లిదండ్రులను భద్రతా కారణాల రిత్యా అరెస్టు చేసి, అక్కడి నుండి వేరే ప్రాంతానికి తరలించి, సుద్దులు చెప్పి వదిలివేశారు. పాట్నా మురికివాడల నుంచి వచ్చిన ఈ బాలుని తల్లి ఇళ్లలో పనులు చేసుకుంటుంది. తండ్రి దినసరి కూలీగా జీవనం సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి ఈ ఆణిముత్యం బయలుదేరింది. రెడ్ టీ షర్ట్ ధరించి, నుదుటిపై తిలకంతో విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలో పాల్గొన్నాడు. ఇంత చిన్న వయసులోనే ఎంతో పరిణతితో, గట్టిగా మీడియా ఎదుట ఆదిత్య మాట్లాడిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. "ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి రాజీనామా చేయాలి. ఈ పరీక్షలను రద్దు చేయాలి. విద్యార్థులపై లాఠీ ఛార్జికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలి, నా హక్కులను నేను వినియోగించుకుంటున్నా. ఒక పౌరుడిగా నా భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న" అంటూ మాట్లాడాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మీడియా ముందు అతడు చెప్పిన మాటలు 1000 ప్రసంగాల కన్నా ఎక్కువ. వయస్సు చిన్నదే గాని "పిట్ట కొంచెం కూత ఘనం" అన్న చందంగా అతని మాటలు ఉన్నాయి. అతని గొంతులో ఏమాత్రం భయం లేదు. అతని కళ్ళల్లో బెరుకు లేదు. ఇంత చిన్న వయసులోనే ప్రశ్నించే ఆ చైతన్యం ఆ ధైర్యం, ఆ చురుకుదనం చూస్తుంటే రేపటి సమ సమాజానికి ఒక సూర్యోదయం... ఒక వెలుగు రేఖ... ఒక ఆశాకిరణం...లా కనబడ్డాడు. ఆరేళ్ల పిల్లాడు కూడా మీడియాను ఎదుర్కొని ప్రతి ప్రశ్నకు తడుముకోకుండా సమాధానం

చెప్పాడు. కానీ మోడీజీ మాత్రం స్వతంత్ర మీడియాను చూడగానే ప్రక్కకు పోతాడు. ఇప్పుడు చెప్పండి 56 అంగుళాల ఛాతి ఉన్న మనిషి ఎవరు...? ఆరేళ్ల బాలుడి ప్రశ్నలకు కూడా భయపడే స్థితికి మన మోడీ ప్రభుత్వం చేరుకుంది.

ఒకటవ తరగతి చదువుతున్న ఆదిత్యను స్కూల్‌కు వెళ్లాల్సిన వయసులో ఆందోళనలు నీకెందుకని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా "అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వచ్చానన్నాడు. ఇప్పుడు పేపర్ లీకులు అవుతున్నాయి. నేను పెద్దయ్యాక కూడా ఇలాంటివి జరగకూడదు, అని నేను కూడా నిరసనకు దిగాను" అంటూ బదులిచ్చాడు. "విద్యాశాఖా మంత్రి రాజీనామా చేయాలని" డిమాండ్ చేశాడు. "బుల్లెట్ గాయాలకు కూడా తాను సిద్ధమేనని, అవసరమైతే మొదటి తూటా నా పైనే ప్రయోగించండి" అంటూ ధైర్యంగా మాట్లాడాడు. "దేశ భవిష్యత్తు తలపై దెబ్బ తగిలింది. లాఠీ చార్జీలకు, జైళ్లకు, బుల్లెట్లకు భయపడి వెనక్కి తగ్గేదే లేదు" అన్నాడు. విద్యార్థులపై లాఠీచార్జికి ఎవరు అనుమతి ఇచ్చారో?" ... సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. అయితే ఆదిత్య గతంలో ఇతర నిరసన కార్యక్రమాల్లో కూడా పాల్గొనినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇలా 'డబుల్ ఇంజన్' సర్కార్ను ఆదిత్య ప్రశ్నిస్తూ భయం పుట్టించాడు. రేపు ఈ బాలుడిని కూడా 'దిమాగీ నక్సలైట్' అన్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రశ్నించటమే నిజమైన దేశభక్తి అని ఈ బాలుడు చాటి చెప్పాడు. చిన్నపిల్లలు మొదలు పండు ముసలి వరకు ప్రశ్నిద్దాం... ప్రశ్నించటంతోనే సైన్స్, మానవ సమాజం అభివృద్ధి చెందింది. ఆరేళ్ల వయసులోనే విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం గళమెత్తిన బాల నాయకుడు ఈ ఆదిత్యుడు. సామాజిక సమస్యలపై తన బలమైన గొంతును వినిపించాడు. నేటి యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవస్థలో రావలసిన మార్పులపై చాలా స్పష్టంగా మాట్లాడాడు. ఒక లోపభూయిష్టమైన వ్యవస్థను రూపుమాపకుండా, కొత్త వ్యవస్థను నిర్మించుకోలేమని నినదించాడు. చిన్న వయసులోనే సామాజిక స్పృహ కలిగి, ప్రజల బాధలను నిర్భయంగా, స్పష్టంగా ప్రస్తావించటం అందరిని ఆశ్చర్యపరిచింది. ఆ బాలుడు మాట్లాడిన తీరు, అతని మాటల్లోని నిజాయితీ కారణంగా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాడు. భవిష్యత్ తరాల బంగారు భవిష్యత్తు కోసం సమాజంలో మార్పు రావాలని ఆ చిన్నారి ఆకాంక్షించాడు. హక్కుల కోసం నిర్భయంగా మాట్లాడే నాయకత్వ లక్షణాలు వయసుతో సంబంధం లేకుండా ఉంటాయని ఈ బాలుడు నిరూపించాడు. గతితార్కిక చారిత్రక నియమాల ప్రకారం చరిత్ర తన చారిత్రక అవసరాల కోసం కడుపుతో ఉండి, వీరులను కంటుంది. హిట్లర్‌ను చంపడానికి చరిత్ర స్టాలిన్‌ను కన్నది. అలాగే భరతమాత భారతదేశ చరిత్ర గమనంలో మార్పులో భాగంగా ఇదిగో...! ఈ అభినవ భగత్‌సింగ్, ఉద్ధంసింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరిలు మళ్లీ పుట్టటం మొదలైంది. ఈ బాలుడిని కన్న తల్లిదండ్రులకు రెడ్ సెల్యూట్. సామాన్య ప్రజలు, మేధావులు, విద్యార్థులు, మొత్తం పౌర సమాజం ఈ సమాజ మార్పుకై దృష్టి సారించాల్సిన అవసరాన్ని ఈ సంఘటన గుర్తుచేస్తుంది. •

# మతం పేరిట ఆర్థిక నేరాలకు పాల్పడితే తీవ్రమైన పరిణామాలు

**సుప్రీంకోర్టు ఘాటైన తాజా తీర్పులు....** – **కోటేశ్వరరావు బి.వి.**

దేశంలోని పలుచోట్ల దేవుడు, మతం పేరుతో పెచ్చుమీరుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను నిరసిస్తూ సర్వోన్నత న్యాయస్థానానికి అందిన ఫిర్యాదులు లేదా ప్రజావ్యాజ్యాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం స్పందించి వెల్లడించిన తాజా తీర్పుల వివరాలను సమాచారం నిమిత్తం ఇవ్వడమైనది.....

భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఏ మతానికైనా సరే.. మతం పేరుతో ప్రజలను ప్రలోభపెట్టడం, సైబర్ మోసాలకు పాల్పడటం, సామాజిక విద్వేషాలు రెచ్చగొట్టే అంశాలపై తాజాగా 2026లో అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పులను వ్యాఖ్యలను వెల్లడించింది. దేవుడు లేదా మతం అనే ముసుగు చట్ట వ్యతిరేక చర్యలకు రక్షణ కవచం కాబోదని న్యాయవ్యవస్థ స్పష్టం చేసింది. విదేశీ బహుమతులు, దైవిక కానుకలు లేదా కస్టమ్స్ అధికారుల పేరిట భయపెట్టి ప్రజలను “డిజిటల్ అరెస్ట్” చేసి కోట్ల రూపాయలు దోచుకునే అంతర్జాతీయ సైబర్ నేరాలను సుప్రీంకోర్టు అత్యంత ఘోరమైన నేరంగా అభివర్ణిస్తూ జూలై 27, 2026 న చారిత్రాత్మక ఆదేశాలను జారీ చేసింది. Suo Motu Writ Petition (Criminal) No. 4 of 2026 కేసులో భాగంగా విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ అంతర్జాతీయ ముఠాలు ఏ మతం పేరుతోనైనా సరే ప్రజలను లూటీ చేస్తుంటే ఊరుకునేది లేదని పేర్కొంటూ, వీటికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో సీబీఐ ప్రత్యేక దర్యాప్తుకు ఆమోదం తెలిపింది. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థే లేదని, ప్రజల భయాన్ని ఆసరాగా చేసుకుని దోచుకునే ఇలాంటి నెట్‌వర్క్‌లను ఉక్కుపాదంతో అణచివేయాలని దేశవ్యాప్త పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించింది. మతం ముసుగులో దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న విద్వేషపూరిత ప్రసంగాల (Hate Speech) నియంత్రణపై దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ ఏప్రిల్ 28, 2026న Shaheen Abdulla v. Union of India (Writ Petition (Civil) No. 940 of 2022) కేసులో తుది తీర్పునిచ్చింది. ఏ మతానికి వ్యతిరేకంగానైనా లేదా ఏ మత పెద్దలైనా సరే సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలను మోసం చేసేలా విద్వేష ప్రసంగాలు చేయడాన్ని అరికట్టడానికి ప్రస్తుతం ఉన్న చట్టాలు పూర్తిగా సరిపోతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కొత్త చట్టాలు చేయడం కంటే, ప్రస్తుతం ఉన్న చట్టాలను పోలీస్ యంత్రాంగం కఠినంగా అమలు చేయడంలో ఉన్న లోపాల వల్లే ఇలాంటి మోసగాళ్లు తప్పించుకుంటున్నారని కోర్టు నిలదీస్తూ, చట్టాన్ని ఉల్లంఘించే ఏ మత ప్రచారకుడినైనా తక్షణమే అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు ఉందని తేల్చిచెప్పింది. దైవ స్వస్థత (Divine Healing), ఉచిత విద్య, నగదు లేదా బహుమతుల వంటి ఆర్థిక ప్రలోభాలను ఎరగా వేసి అమాయకులను మోసం చేయడం మరియు తప్పుడు ప్రచారాలతో మతం మార్చడం వంటి చట్టవిరుద్ధ చర్యలపై సుప్రీంకోర్టు మార్చి 20, 2026న Ashwini Kumar Upadhyay v. Union of India (Writ Petition (Civil) No. 63 of 2022) కేసులో కీలక మార్గదర్శకాలను ఇచ్చింది. మతమార్పిడి ప్రలోభాల పేరిట సాగే నిజమైన మోసాలను తీవ్రంగా ఖండిస్తూనే, కేవలం

కక్షసాధింపు చర్యల కోసం నమ్మదగిన ఆధారాలు లేకుండా వేసే తప్పుడు కేసులను కూడా అంగీకరించబోమని న్యాయస్థానం స్పష్టం చేసింది. పక్కా సాక్ష్యాధారాలతోనే సమాజంలో చట్ట వ్యతిరేక శక్తులను చట్టం ముందు నిలబెట్టాలని కోర్టు స్పష్టం చేసింది. మతంతో సంబంధం లేకుండా ఏ మతపరమైన ట్రస్టు లేదా సంస్థలైనా సరే.. ప్రజలు భక్తితో ఇచ్చే విరాళాలను, నిధులను అక్రమంగా మళ్లిస్తే సహించేది లేదని సుప్రీంకోర్టు జూలై 20, 2026న Subhash Chandra Agrawal v. Union of India (Writ Petition (Civil) No. 512 of 2026) కేసులో పేర్కొంది. వివిధ మతపరమైన నిధుల అవకతవకలు మరియు దుర్వినియోగ ఆరోపణలపై దాఖలైన కేసులలో విచారణ జరుపుతూ, మతపరమైన నిధుల అవకతవకలపై రాజకీయాలు చేయకుండా, సీనియర్ పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. చట్టం ముందు ఏ మతమైనా ఒకటేనని, మతం పేరిట ఆర్థిక నేరాలకు పాల్పడితే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించింది.

---



### భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, నాస్తికసమాజం సానుభూతిపరులు

## కామ్రేడ్ కె. జ్యోతికు జోహార్లు!

CPI వనపర్తి జిల్లా, నాయకులు కామ్రేడ్ కె.విజయరాములు భార్య **జ్యోతి** ది.06-09-2026 ఆదివారం అనారోగ్యంతో మరణించారు. జ్యోతికి చిన్నతనం నుంచి దైవభక్తి ఎక్కువ. సాంప్రదాయ కట్టుబాట్ల నడుమ పెరిగిన వాతావరణం. ఉన్నత చదువులతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకున్న జ్యోతి వివాహం ది.1-11-2009లో కమ్యూనిస్టు పార్టీ నాయకులు విజయరాములుతో మత సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎటువంటి హంగూ ఆర్భాటాలు లేని కమ్యూనిస్టు పద్ధతిలో దండలు మార్చుకుని సంస్కరణ వివాహము చేసుకున్నారు. విజయరాములు – జ్యోతి వివాహమును నాస్తిక సమాజం జాతీయ పూర్వ అధ్యక్షులు కె.అయ్యన్న నిర్వహించారు. వనపర్తి జిల్లా 'అమరచింత' మండలంలో నాస్తికోద్యమ వ్యాప్తికి కృషిచేశారు. నాస్తిక సమాజం కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనేవారు. కా॥ జ్యోతి గ్రామ పంచాయితీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే NFIW జిల్లా సమితి సభ్యులుగా మహిళల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. ది.20-09-2026 ఆదివారం ఉదయం 10 గంటలకు వనపర్తి జిల్లా అమరచింతలో కా॥ జ్యోతి సంస్మరణ సభ జరిగింది. కామ్రేడ్ కె.జ్యోతి మరణం నాస్తిక, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు. **కామ్రేడ్ జ్యోతికు** నాస్తిక సమాజం జోహార్లు అర్పిస్తూ – వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తుంది.


కా॥ విజయరాములు–జ్యోతిల సంస్కరణ వివాహము

**– నాస్తిక సమాజం**

# అసమానతకు శాశ్వత చిరునామా 'మనుస్మృతి'

- డా॥ చల్లపల్లి స్వరూపరాణి

చరిత్రకారులు ఎంతసేపటికీ భారత్ పై మహ్మదీయుల దండయాత్రల గురించి రాయడంతో పుస్తకాలు నింపేశారని, నిజానికి హిందూ ఇండియాపై మహ్మదీయుల దురాక్రమణ కంటే అంతకు ముందు బౌద్ధ ఇండియాని బ్రాహ్మణవాదులు దురాక్రమించారని ముస్లింలు రాకపూర్వం జరిగిన భారతదేశ చరిత్ర మొత్తం బౌద్ధులకూ, బ్రాహ్మణవాదులకూ మధ్య జరిగిన సంఘర్షణే అని అంబేద్కర్ అంటారు. ఆ చరిత్రలో 'మనుస్మృతి' రచన ఒక ముఖ్యమైన అధ్యాయం.

'మనుస్మృతి' ఒక మత గ్రంథమో లేక కాల్పనిక కావ్యమో కాదు. అది ఒక 'అధర్మశాస్త్రం'. మనుస్మృతి రచనకూ భారత రాజకీయ చరిత్రతో కొంతకాలం ప్రత్యక్ష సంబంధం, మరికొంతకాలం పరోక్ష సంబంధం ఉంది. బౌద్ధాన్ని ఈ దేశపు సాంస్కృతిక అస్తిత్వంగా అధికారికంగా ప్రకటించిన మౌర్య అశోకుడు తన పరిపాలనను బౌద్ధ ధర్మ సూత్రాలకు అనుగుణంగా సాగించడమే కాదు తన రాజ్యంలో వైదిక క్రతువులైన యజ్ఞ యాగాలనూ, జంతు బలులనూ నిషేధించాడు. దీనితో బ్రాహ్మణులకు ప్రాధాన్యత లేకుండా పోయింది. దానికంటే బౌద్ధం వైదిక బ్రాహ్మణ మతాన్నీ, వేదాల ప్రామాణికతనీ బోనులో నిలబెట్టి దానికి ప్రత్యామ్నాయ తాత్విక దృక్పథాన్ని ముందుకు తీసుకురావడం బ్రాహ్మణ మతస్తులకు తీవ్ర అసంతృప్తిని, బౌద్ధం పట్ల దాని అనుయాయుల పట్ల శత్రు భావాన్ని కలిగించింది. బౌద్ధం పట్ల బ్రాహ్మణ ద్వేషానికి 'పుష్యమిత్ర శుంగుడు' ప్రతినిధి అయ్యాడు. అశోకుడి మనుమడైన బృహద్రధుని రాజ్యంలో సేనాధిపతిగా ఉండే పుష్యమిత్రుడు రాజుని కుట్రతో చంపి ఆ సింహాసనాన్ని అధిష్టించాడు. బృహద్రధుని హత్య క్రీ.పూ. 185లో జరిగిందని చరిత్ర చెబుతుంది. పుష్యమిత్రుడు రాజ్యాన్ని అధిష్టించాక యజ్ఞయాగాది క్రతువులను పునరుద్ధరించడంతో పాటు బౌద్ధ విప్లవంతో బలహీనపడిన బ్రాహ్మణ మతాన్ని తిరిగి బతికించడం కోసం మనుస్మృతిని రాయించాడు. ఇది క్రీస్తుకు పూర్వం 185 తర్వాత గ్రంధస్తం అయ్యిందని అంబేద్కర్‌తో పాటు మరికొందరు చరిత్రకారుల అభిప్రాయం.

మనుస్మృతిని ఒక దైవికమైన గ్రంథంగా 'సృష్టికర్త' 'మనువు' అనే వ్యక్తికి చెప్పగా ఆయన దీన్ని గ్రంథస్తం చేశాడని భావించేవారు ఇప్పటికీ ఉన్నారు. 'మనువు' అనే పేరుకు ప్రాచీన కాలంలో కొంత గౌరవం, అంగీకారం ఉంది. అయితే నిజంగా 'మనువు' అనే వ్యక్తి లేడనీ, కేవలం ఆ పేరుకు ఉండే ప్రాచీనత, 'దైవత్వం' అనే అంశాల దృష్ట్యా రచయిత అయిన 'సుమతీ భార్గవ'కు ఆ పేరు ఆపాదించారని అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ గ్రంథ రచయిత పేరు గ్రంథంలో ఎక్కడా ఉండక ప్రతి అధ్యాయం చివరలో అతని వంశ నామమైన 'బృగు' అని ఉంటుందని, కనుక మనుస్మృతికి 'బృగుకృత సంహిత' అనే మరో పేరు ఉందని బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యాఖ్యానించారు. ఈ గ్రంథాన్ని పాలకులు, ప్రజలు, ధర్మశాస్త్రంగా భావిస్తారు కాబట్టి దీనికి 'మనుధర్మ నియమావళి' అనే పేరు కూడా ప్రాచుర్యంలో ఉంది. 'మనుస్మృతి' బ్రాహ్మణ మతస్తులచే ఒక రాజకీయ ఉద్దేశ్యంతో రూపొందిన గ్రంథం కాబట్టి తర్వాత వచ్చిన ఇతర స్మృతి కర్తలకు దాని పుట్టుపూర్వోత్తరాల

గురించిన అవగాహన ఉంది. అందువల్లనే క్రీ. శ నాల్గవ శతాబ్దంలో రాసిన నారద స్మృతి కర్త ద్వారా మనుస్మృతి గ్రంథకర్త అసలు పేరు 'సుమతీ భార్గవ' అనే విషయం బైటికొచ్చింది.

మనుస్మృతి బౌద్ధం తీసుకొచ్చిన సామాజిక విప్లవ సిద్ధాంతాన్ని చంపి పాతరేసింది. బుద్ధుని బోధనల ప్రభావంతో తమ కుల ధర్మానికి విరుద్ధంగా సామాజిక మార్పు కోసం బతికే వాళ్ళని, హేతువాదులనూ, కులాంతర వివాహాలు చేసుకునే వాళ్ళని 'పాషండు'లని, 'దుర్మార్గు'లని, హేతువాదులను, వేద విరుద్ధంగా మసలే వారిని క్రూరులని పేర్కొంది మనుస్మృతి. అది అసమానత ప్రాతిపదికన మనుషుల మధ్య అంతరాలు సృష్టించి, వివిధ సామాజిక వర్గాల మధ్య స్పష్టమైన విభజన రేఖలు గీసింది. సమాజంలో బ్రాహ్మణులకు అత్యున్నత స్థానాన్ని బహూకరించి శూద్రులకు (దళితులు కూడా ఈ వర్గంలో భాగం), స్త్రీలకు బానిసత్వాన్ని అంటగట్టింది. ప్రపంచలో ఏది ఉందో అదంతా బ్రాహ్మణులదేనని, ఉన్నతమైన పుట్టుక వల్ల వారికి అన్నీ తీసుకునే హక్కు ఉందని పేర్కొంది. రాజులు కూడా వారి సలహాలు పాటించాలని వారు బ్రాహ్మణులకంటే అధములని చెప్పింది. శూద్రుల ముడ్డికి చీపురూ, మొలకు ముంతా కట్టింది... వారిని కుక్కలతో పోల్చి వారు ఎదురొస్తే ఎంత దూరం జరగాలో, వారి శ్రమను ఏ విధంగా దోపిడీ చెయ్యొచ్చో, వారికి ఎటువంటి శిక్షలు వెయ్యాలో నిర్ణయించింది. వారి పట్ల ఇతరులు అంటరానితనాన్ని పాటించినప్పటికీ వారి సేవలను ఉచితంగా వినియోగించుకోవచ్చని మనుస్మృతి పేర్కొంది. వివిధ కులాల మధ్య వర్ణ సంకరాన్ని అరికట్టడానికి అనేక నియమాలు రూపొందించి కింది కులాల పురుషులతో వివాహం సంబంధంలోకి వెళ్ళే పై కులాల స్త్రీలకు కూడా ఘోరమైన శిక్షలు విధించి వారి సంతానాన్ని అంటరానివారిగా పరిగణించాలని శాసించింది. ఒకే నేరానికి పై కులాలకు సాధారణ శిక్షలనూ, శూద్రులకు కఠిన శిక్షలనూ నిర్దేశించింది. బ్రాహ్మణుడు ఎంత పెద్ద నేరం చేసినా అతడు శిక్షార్హుడు కాదు. స్త్రీలు నమ్మశక్యం కాని మనుషులని, వారు అన్ని అవస్తలలో పురుషుల అజమాయిషీ కింద బతకాలని చెప్పడమే కాదు వారు వివాహం అనే చట్రం నుంచి బైటికి రాకుండా విడాకులు తీసుకునే అవకాశాన్ని నిషేధించింది. వివాహ వ్యవస్థని, కులవ్యవస్తని పవిత్రమైనవిగా చిత్రించింది. ఈనాడు అణగారిన కులాలు, స్త్రీల స్థితికి మూలం మనువు రూపొందించిన నియమ నిబంధనలే మూలం. అందుకే ప్రముఖ Indologist వెండీ డోనిగర్ భారతదేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చేదాకా మనుస్మృతే అమలులో ఉందని పేర్కొన్నారు (తర్వాత కూడా ఉందనుకోండి). మనుస్మృతి రచన, దాని అమలు ద్వారా బౌద్ధం నుంచి సమాజంలో వ్యాప్తి చెందిన సమత, హేతుబద్ధత అనే భావనల స్థానంలో అసమానత, మూఢత్వం, స్త్రీ పురుషుల మధ్య అంతరాలు పెంపొందాలని ఆశించిన బ్రాహ్మణవాదం తన ప్రణాళికను విజయవంతంగా అమలుచేసింది. అందుకే మనుస్మృతి కేవలం ఒక మత గ్రంథం కాదు, అది రాజకీయ వ్యూహం, సమాజంలో అసమానతలు, అంధత్వం ఉండాలని కోరుకునే పాలక వర్గాలు రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి ప్రజల పట్ల ముఖ్యంగా అణగారిన కులాలు, స్త్రీల విషయంలో సనాతన ధర్మంగా భావించే ఆ శిక్షాస్మృతిని 'దైవవాక్కు' లాగా అమలుచేస్తాయి... దాన్ని ఉంచాలో తగలబెట్టాలో బాధితులే నిర్ణయించుకుంటారు...

డిసెంబర్ 25, 1927న బాబాసాహెబ్ అంబేద్కర్ మనుస్మృతిని తగలబెట్టి మనువాదులకు ఒక పెద్ద సవాల్ విసిరారు.

•

# చైతన్యాన్ని కలిగించిన నాస్తిక అధ్యయన తరగతులు

ది.16-08-2026 ఆదివారం ఉ॥ 10 గంటల నుండి సా॥ 5 గంటల వరకు వనపర్తిలోని రిటైర్డు ఉద్యోగుల సంఘ భవనంలో నాస్తిక సమాజం తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో నాస్తిక అధ్యయన తరగతులు జరిగాయి. ఉదయం కార్యక్రమమునకు AITUC వనపర్తి శాఖ నాయకులు గోపాలకృష్ణ ఆహ్వానం పలుకగా- CPI వనపర్తి జిల్లా నాయకులు రమేష్ అధ్యక్షత వహించారు. 'గతితార్కిక భౌతికవాదం' అనే అంశంపై విశ్రాంత ఆచార్యులు డా॥ కె. విజయకుమార్ మాట్లాడుతూ–వేల సంవత్సరాలుగా భౌతికవాదులు మూఢవిశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నా సత్ఫలితాలను సాధించలేక పోయామనే విషయాన్ని మనం గమనించాలి. నేటి మన విద్యా విధానంలో సైన్సును అశాస్త్రీయ పద్ధతిలో బోధిస్తున్నారు. సైన్సును చదవటం వేరు. శాస్త్రీయ దృకృథం కలిగివుండటం వేరు. సుఖము–దుఃఖము ఒకటే అనేది మోసపూరిత సిద్ధాంతం. అది గతితార్కిక భావవాదం. సుఖము–దుఃఖము ఒకటి కాదు. అందులో మనకు కనబడని సంబంధాలున్నాయి. కనబడని సంబంధాలను తెలియ చెప్పేది, అధ్యయనం చేసేది గతితార్కిక భౌతికవాదం. గతితార్కిక భౌతికవాదం పద్ధతిలో మనం సైన్సును అర్థం చేసుకోవాలి అని అన్నారు.

మధ్యాహ్నం కార్యక్రమానికి నాస్తిక సమాజం నాయకులు ఎస్. ప్రభాకర్ ఆహ్వానం పలుకగా, నాస్తిక సమాజం నాయకులు ఎ. భాస్కర్ అధ్యక్షత వహించారు, 'మతము – చరిత్ర' అనే అంశంపై తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య మాట్లాడుతూ – నాస్తికునిగా చెప్పుకోవాలంటే నిజాయితీగా బ్రతకాలి. మేథోశ్రమ చేయాలి. భౌతిక పరిస్థితుల పట్ల పూర్తి అవగాహనతో వున్నప్పుడే నేను నాస్తికున్ని అని చెప్పుకునే ధైర్యం చేయగలుగుతాను. తన కళ్ళముందు నిత్యం జరుగుతున్న పరిణామాలు చూసి స్పందించేవాడే మానవుడు. మనిషే కేంద్రంగా చెప్పేదే నాస్తికత్వం. మారుతున్న కాలంతో పాటు సమాజము, వ్యవస్థలు అన్నీ మారుతుంటాయి. మనం ఇప్పుడున్న ఉనికిలో నుంచి చరిత్రను చూస్తున్నాం. కానీ, గతంలో నుంచి వస్తున్న ప్రాతిపదిక మీదుగా మనం చరిత్రను చూడాలి. మతం ఎప్పుడూ ఒకే విధంగా లేదు, వుండదు. మతము – అధికారము పెనవేసుకొని ఆధిపత్య ధోరణిలోకి వెళుతుంది. దానికి ప్రతిగా ఆ మతం నుంచే ప్రతిఘటన ప్రారంభ మవుతుంది. తొలివేదం విగ్రహారాధనను వ్యతిరేకించింది. మన దేశంలో 300 రామాయణాలు దాకా వున్నాయి. తులసిదాసు రాసిన రామాయణం మనల్ని కబ్జాచేసి పెట్టిన రామాయణం. కబీర్ రాముడు నిర్గుణరాముడు. కబీర్ మతాలను ఎడాపెడా వాయించాడు. ఎప్పుడూ బలిలాంటి రాజులే వుండరు. బలి చరిత్ర నుండి అనుభవాలను అధ్యయనం చేసిన వారు చాలామంది వుంటారు. మనం భయపడినచోట, మన ఉనికి దొరకదని భావించిన చోట సగర్వంగా నిలబడగలిగే కాలం వస్తుంది. ఎందుకంటే ఈ భూమి విప్లవ క్షీరదం – అని అన్నారు. CPI నేత శ్రీరామ్, CPM జిల్లా నేత పుట్టా ఆంజనేయులు, కవి జనజ్వాల, JVV నాయకులు నరేందర్, APTF జిల్లా నాయకులు వెంకటనారాయణ, నాస్తిక సమాజం నాయకులు మైత్రి యాదయ్య, DHG పోలప్ప, సామాజిక కార్యకర్తలు గంధం నాగరాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

Editor, Printed & Published by : **B. Sudhakar,** Printed at
MYTRI ART PRINTERS, Mahaboobnagar.